www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Karimnagar, Rangareddy, Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 37 | బుధవారం | 9 సెప్టెంబర్, 2026

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

: 99484 33277 / 9014966169





# సభలో గందరగోళం

## ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి..

**నా తల్లిని అవమానించారు.. దానికి ఏం చెబుతారు? హరీశ్‌రావుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం**



- కలియుగ దుశ్శాసనుడిలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారం
- మహిళా సభ్యులను అవమానించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- అసెంబ్లీ ఘటనపై భట్టి ఫైర్.. 'ఫామ్‌హౌస్‌లోనే కుట్రకు బీజం'
- అసెంబ్లీ వద్ద సోమవారం జరిగిన ఘటన కాకతాళీయం కాదు
- 'స్పీకర్‌ను అవమానించడం అంటే సభ మొత్తాన్ని అవమానించడమే'
- బీఆర్ఎస్ ఇంకా భూస్వామ్య భావజాలాన్ని వీడలేదు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల తీరు: మంత్రి శ్రీధర్‌బాబు

# గూండాగిరిని ప్రోత్సహిస్తున్నారా?

- సొంత పార్టీ నేతలను ఉసిగొల్పి ప్రత్యర్థులపై దాడులేంటి?
- ప్రజా సమస్యలను పక్కనపెట్టి అసెంబ్లీలో రాజకీయాలు చేస్తున్నారు
- ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు వయోపరిమితి పెంచాలి
- 20వేల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత




**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రే సొంత పార్టీ నేతలను ఉసిగొల్పి గూండాగిరిని ప్రోత్సహించడం ఏమిటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆమె.. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలని, వారి చావును కోరడం సరికాదన్నారు. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యర్థి నాయకులు, కులాలు, వ్యవస్థలపై దూషణలకు పాల్పడుతున్నారని, ఆయనపై కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటని, పోలీసు వ్యవస్థ ఏం చేస్తోందో అర్థం కావడం లేదన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ సమయాన్ని రాజకీయాల కోసం వృథా చేస్తున్నాయని కవిత విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ భూముల సమస్య, ఉద్యోగ నోటిఫికేషన్లు, యూరియా కొరత, జీవో 97, మహిళల భద్రత, గురుకులాల సమస్యలు, పీఆర్సీ, పెండింగ్ డీఏలు వంటి అంశాలపై సభలో చర్చించి పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సై పోస్టులకు 38 ఏళ్లు, కానిస్టేబుల్ పోస్టులకు 36 ఏళ్ల వరకు వయోపరిమితిని పెంచాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వయోపరిమితి పెంచకుండానే నోటిఫికేషన్ ఇవ్వడంతో దాదాపు 3 లక్షల మంది అభ్యర్థులు తరువాయి 2లో

# కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి ఉద్రిక్తతం

- దప్పులతో నిరసనకు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు
- మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు
- ఫాంహౌస్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్టు
- బోయిన్‌పల్లి పీఎస్ వద్ద రాళ్ల దాడి
- కాంగ్రెస్ నేతలను పోలీసులే ఫాంహౌస్‌కు తీసుకెళ్లారు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే మమ్మల్ని అరెస్టు చేశారు
- దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామన్నారు.. 12 పైసలు కూడా ఇవ్వలేదు: కేటీఆర్
- రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2





# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు

- తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలను సమావేశాల కాలం పూర్తయ్యే వరకు సస్పెండ్ చేసిన మండలి
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలే కారణం.. చర్యలకు తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి దామోదర

**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వారిద్దరినీ ప్రస్తుత శాసనసభ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

### తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర

స్పీకర్‌పై అగౌరవంగా వ్యాఖ్యలు చేయడంతో పాటు అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని,



అయితే రాజ్యాంగబద్ధమైన పదవులు, వ్యవస్థల గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని దామోదర రాజనర్సింహ అన్నారు. స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని విషయమని పేర్కొన్నారు.అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని స్పష్టం చేశారు.

### తీర్మానానికి భట్టి మద్దతు

మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాసనసభలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం దాని అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై మండలిలో చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత సమావేశాల కాలం పూర్తయ్యే వరకు వారిని సస్పెండ్ చేశారు.



# బుల్లెట్ ట్రైన్ కీలక దశకు.. వచ్చే ఏడాది పరీక్షలు

- జూన్ నాటికి పట్టాలపైకి తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్
- 2027లో సూరత్-బిలిమోరా మధ్య సేవలు
- వడోదర నుంచి ముంబయికి కేవలం గంటన్నరలో ప్రయాణం: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

**వడోదర:** భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి బుల్లెట్ ట్రైన్‌ను పట్టాలపైకి తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు, భద్రతా పరిశీలనలు పూర్తయిన 2 నుంచి 4 నెలల్లో రైలు సేవలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు.గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు. బుల్లెట్ ట్రైన్ తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందని, ప్రస్తుతం దానిపై స్క్వీజ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తరువాయి 2లో

# యువత గళం

## విపక్షాల అబద్ధాలను అధిగమిస్తుంది

- భారత భవిష్యత్తును యువతే నిర్ణయిస్తుంది
- ఏ యుగానికి సిద్ధం కావాలి
- నైపుణ్యాలను ఐటీకి పరిమితం చేయొద్దు
- ప్రధాని నరేంద్ర మోదీ

2

# యూపీఐకి ఇక గ్లోబల్ టచ్

- ప్రపంచ చెల్లింపు వ్యవస్థలతో యూపీఐ అనుసంధానం
- 11 దేశాల్లో అందుబాటులో ఉన్న మరింత విస్తరించాలి
- బీమా, ఆర్థిక సేవల్లోనూ డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెరగాలి: మోదీ



**ముంబయి:** భారతదేశపు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ప్రస్తుతం 11 దేశాల్లో అందుబాటులో ఉందని, ఇతర దేశాల చెల్లింపు వ్యవస్థలతో దీనిని అనుసంధానించడమే తదుపరి లక్ష్యంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యూపీఐ ద్వారా లావాదేవీల ఖర్చు, సమయం గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. మంగళవారం ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్–2026లో ఆయన మాట్లాడారు.

### 'భారత్‌కు సొంత ప్రత్యామ్నాయ వ్యవస్థ'

సాంకేతికత అందరినీ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేయగల శక్తిమంతమైన సాధనమని తరువాయి 2లో

# ఎడారిలో కృత్రిమ నది.. సౌదీ అరేబియా అద్భుతం

2

- నదులు లేవు.. వర్షపాతం 100 మి.మీ. కంటే తక్కువ
- సముద్ర జలాలను శుద్ధి చేసి 3.7 కోట్ల మందికి తాగునీరు.. వేల కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్



# పినరయి విజయన్‌పై ఎఫ్ఐఆర్ కోరిన ఈడీ

- కేరళ డీజీపీకి లేఖ.. కుమార్తె వీణ, అల్లుడు రియాస్‌పైనా కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి
- సీఎంఆర్ఎల్ కేసులో సోదాలు, దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా చర్యలకు ఈడీ ప్రతిపాదన

2

# ఫామ్‌హౌస్‌లోనే కుట్రకు బీజం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనలు కాకతాళీయంగా జరిగినవి కాదని, వాటి వెనుక ముందస్తు కుట్ర ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ కుట్రకు ఫామ్‌హౌస్‌లోనే బీజం పడిందని విమర్శించారు. అసెంబ్లీ స్పీకర్‌ను అవమానించడం అంటే కేవలం ఒక వ్యక్తిని అవమానించినట్లు కాదని, మొత్తం శాసనసభను అవమానించినట్లేనని అన్నారు.
ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వ్యవహారశైలి అత్యంత జుగుప్సాకరంగా ఉందని భట్టి విక్రమార్క తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు, స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

### 'బీఆర్ఎస్ భూస్వామ్య భావజాలాన్ని వీడలేదు'

బీఆర్ఎస్ ఇంకా భూస్వామ్య భావజాలం నుంచి బయటపడలేదని భట్టి విక్రమార్క విమర్శించారు. శాసనసభలో ప్రజాస్వామ్య పద్ధతులను పాటించకుండా వ్యవహరించడం సరికాదన్నారు. సభా మర్యాదలు, సంప్రదాయాలను ప్రతి సభ్యుడు గౌరవించాలని సూచించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరిగిందని ఆయన అన్నారు. సభా వ్యవహారాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని భట్టి పేర్కొన్నారు.

# ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో నిన్న చోటుచేసుకున్న ఘటనలపై రెండో రోజు కూడా సభలో వాగ్యుద్ధం కొనసాగింది. సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీనియర్ మహిళా సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
మహిళా సభ్యులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు నమోదు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ఘటనను రాష్ట్రంలోని యావత్ మహిళలపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ''కలియుగ దుశ్శాసనుడిలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. గౌరవ సభ కౌరవ సభగా మారింది. ఆనాడు కౌరవులకు పట్టిన గతే రేపు కాంగ్రెస్ పార్టీకి పడుతుంది'' అని వ్యాఖ్యానించారు.

### మీకు కాదు.. నాకు ఆవేశం ఉండాలి'

హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా సభ్యుల పట్ల తనకూ ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేస్తూ హరీశ్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మహిళా సభ్యులంటే సభతో పాటు నాకు కూడా గౌరవం ఉంది. మీరు చెబితే నేను వినట్లేదా? ఎందుకంత ఆవేశం? మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి'' అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా స్పీకర్ భావోద్వేగానికి గురయ్యారు. ''నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు'' అని పేర్కొన్నారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి పట్ల తనకు కూడా గౌరవం ఉందన్నారు. తనకు ఉన్న ఎనిమిది మంది అక్కాచెల్లెళ్లతో పాటు వారిని కూడా సోదరీమణులుగా భావిస్తానని తెలిపారు. మహిళా సభ్యుల పట్ల దురుసు ప్రవర్తనకు సంబంధించిన నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పీకర్ స్పష్టం చేశారు.

### స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ తీరు: శ్రీధర్‌బాబు

శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్పీకర్‌ను బెదిరించేలా బీఆర్ఎస్ సభ్యుల వ్యవహారశైలి ఉందని విమర్శించారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఈ విధంగా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. బెదిరింపు ధోరణితో సభ నడవదని స్పష్టం చేశారు.సభలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందన్నారు. సభ అందరిదని, దాన్ని ఎలా నడపాలో స్పీకర్‌కు సభ్యులు చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. సెంబ్లీ వద్ద జరిగిన ఘటనలకు సంబంధించిన వీడియోలు, రికార్డులను ప్రజల ముందుంచితే వాస్తవాలు స్పష్టమవుతాయని శ్రీధర్‌బాబు అన్నారు. మహిళా సభ్యుల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పీకర్ చెప్పినా బీఆర్ఎస్ సభ్యులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

### క్షమాపణలు చెప్పకుండా రాజకీయం: అడ్లూరి లక్ష్మణ్

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణలు చెప్పకుండా బీఆర్ఎస్ సభ్యులు ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందన్నారు.

# యువత గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తుంది



**వడోదర:** యువత ఆకాంక్షలు, వారి గళం విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించేవారు ప్రతి మలుపులోనూ కనిపిస్తారని, అయితే భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును యువతే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

### 'ఫైళ్లు తిరిగాయి.. ఇప్పుడు పనులు పరుగులు'

కేంద్ర ప్రభుత్వ పనితీరులో వచ్చిన మార్పునకు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ అని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టు చివరి దశ కూడా పూర్తయిందని తెలిపారు. 2004లో ప్రాజెక్టును ప్రతిపాదించగా.. దాని అమలు కోసం 2006లో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అయితే 2014 వరకు ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లు వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగాయని గత యూపీఏ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. గత పదేళ్లలో వారు 50 వేల టాయిలెట్లు కూడా నిర్మించలేకపోయారని, తమ ప్రభుత్వం మాత్రం 50 వేల రైలు కోచ్‌లను నిర్మించిందని మోదీ పేర్కొన్నారు.

### ఏఐ నైపుణ్యాలు అందరికీ అవసరం

ఏఐ యుగానికి యువత ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ప్రధాని సూచించారు. కృత్రిమ మేధ నైపుణ్యాలు కేవలం ఐటీ రంగానికే పరిమితం కాకూడదని అన్నారు. అన్ని రంగాల్లో ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్ విస్తరణతోనూ యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. అనేక కుటుంబాలు విద్యుత్ వినియోగదారులతో పాటు ఉత్పత్తిదారులుగా మారుతున్నాయని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి, పరికరాల ఏర్పాటు, నిర్వహణ సేవలు విస్తరిస్తుండటంతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకు తయారీ రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తోందని మోదీ అన్నారు.

### ధురంధర్ పాటతో స్వాగతం

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్న సమయంలో వేదికపై 'ధురంధర్' చిత్రంలోని 'Aari Aari', 'క్వీన్' సినిమాలోని 'We Will Rock You' పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానికి ఘన స్వాగతం లభించింది.

# కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి ఉద్రిక్తతం

**ప్రజానావ, హైదరాబాద్:** కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ దళితులను అవమానించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాలు చేపట్టిన నిరసనకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. సుమారు వెయ్యి మంది డప్పు కళాకారులతో కేసీఆర్ ఫాంహౌస్ ఎదుట నిరసనకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. వరదరాజాపూర్ మీదుగా ఫాంహౌస్ సమీపానికి చేరుకున్న నిరసనకారులను పోలీసులు నిలువరించారు.

### డప్పుల మోతతో నిరసన

కేసీఆర్ ఫాంహౌస్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో కాంగ్రెస్ శ్రేణులు డప్పులు మోగిస్తూ నిరసన చేపట్టాయి. ఫాంహౌస్ వైపు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు కొందరు నిరసనకారులు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. నిరసనకారులను వెనక్కి పంపే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. దాదాపు రెండున్నర గంటల పాటు ఫాంహౌస్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఫాంహౌస్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
కాంగ్రెస్ చేపట్టిన నిరసనలకు ప్రతిగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనలతో తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కేసీఆర్ ఫాంహౌస్ వైపు వెళ్తున్న కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించారు.

### పాదయాత్రగా బయల్దేరిన కేటీఆర్, హరీశ్‌రావు

ఫాంహౌస్ వద్ద పరిణామాలపై సమాచారం అందుకున్న కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. బొల్లారం వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను పోలీసులు నిలిపివేయడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.కేసీఆర్ నివాసం వైపు ఎవరినీ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఫాంహౌస్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించినట్లు అధికారులు వివరించారు. అయితే కాంగ్రెస్ శ్రేణులకు ఎస్కార్ట్, రోప్ పార్టీలు ఇచ్చి ఫాంహౌస్ వైపు తీసుకెళ్లినట్లు ఓ వీడియోను కేటీఆర్ పోలీసులకు చూపించారు. కాంగ్రెస్ కార్యకర్తలను కూడా అడ్డుకోవాలని ఆయన కోరారు. పోలీసులు అనుమతించకపోవడంతో కేటీఆర్, హరీశ్‌రావు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లికి పాదయాత్రగా బయల్దేరారు. దీంతో పోలీసులు వారిని



అదుపులోకి తీసుకుని కేటీఆర్‌ను బోయిన్‌పల్లి, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

### బోయిన్‌పల్లి పీఎస్ వద్ద ఉద్రిక్తత

కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్న విషయం తెలియడంతో ఆ పార్టీ కార్యకర్తలు భారీగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. పోలీస్ స్టేషన్ ఎదుటే కుర్చీలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల నుంచి ఎర్రవల్లి వైపు బయల్దేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరికొందరిని గృహనిర్బంధంలో ఉంచారు.

### పోలీసుల జోక్యంతో చెదరిపోయిన ఇరువర్గాలు

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ స్టేషన్ పరిసరాల్లో భద్రతను పెంచారు. కేటీఆర్‌ను ఎర్రవల్లి వెళ్లకుండా అడ్డుకోవడంపై బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా బోయిన్‌పల్లి పీఎస్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

### ఎన్‌హెచ్–44పై బీఆర్ఎస్ నేతల నిరసన

పోలీస్ స్టేషన్ వద్ద పరిణామాల అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్‌హెచ్–44పై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళనకారులను అక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నిరసన, బీఆర్ఎస్ నేతల అరెస్టుల నేపథ్యంలో హైదరాబాద్ పరిసరాల్లో రాజకీయ ఉద్రిక్తత కొనసాగుతోంది.

### 'దళితబంధు రూ.12 లక్షలు ఏమయ్యాయి?'

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. దళితులపై ప్రేమ ఉంటే గిరిజన డిక్లరేషన్ సహా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు కింద రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి 12 పైసలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం వాటా ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు దాటినా హామీలు అమలు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా రాజకీయ అంశాలతో సమయం వృథా చేస్తున్నారని విమర్శించారు.

### 'రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్'

మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రభుత్వం రాజకీయ అంశాలను తెరపైకి తెస్తోందని ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డితో జరిగిన ఘటనపై సీఎం స్పందించలేదని, మహిళా ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డిని 'కలియుగ దుశ్శాసనుడు'గా అభివర్ణించిన హరీశ్‌రావు.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి రావడాన్ని ప్రస్తావిస్తూ.. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు. సీఎం వైఫల్యాల కారణంగానే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

### 'కేసీఆర్ ఇంటిపై దాడికి ఉసిగొల్పారు'

కేసీఆర్ నివాసం వద్ద జరిగిన పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని హరీశ్‌రావు కోరారు. కేసీఆర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఎర్రవల్లి పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫాంహౌస్ పరిసరాలతో పాటు బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

# యూపీఐకి ఇక గ్లోబల్ టచ్

(మొదటి పేజీ తరువాయి)

మోదీ అన్నారు. సంప్రదాయ బ్యాంకింగ్ సేవలు చేరుకోలేని ప్రాంతాలకు ఫిన్‌టెక్ సేవలను తీసుకెళ్లడమే దాని ప్రత్యేకత కావాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఆధునిక డిజిటల్ ఆర్థిక సేవలను అందించడంలో యూపీఐ విజయవంతమైందని చెప్పారు. అంతర్జాతీయ కార్డు చెల్లింపులు ఇతర దేశాల్లో రూపొందిన వ్యవస్థలపై ఆధారపడి ఉన్నాయని, భారత్‌కు మాత్రం సొంతంగా రూపొందించుకున్న ప్రత్యామ్నాయ వ్యవస్థగా యూపీఐ ఉందని పేర్కొన్నారు. దేశీయంగా రూపొందించిన ప్రమాణాలు, నియమాలను పాటిస్తూనే.. ప్రపంచంలోని ఇతర చెల్లింపు వ్యవస్థలతో యూపీఐని అనుసంధానించగలమని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు స్వదేశానికి పెద్ద మొత్తంలో నిధులు పంపుతున్నారని మోదీ అన్నారు. అంతర్జాతీయ నగదు బదిలీల్లో యూపీఐ వినియోగం పెరిగితే లావాదేవీల వ్యయం తగ్గడంతో పాటు నిధులు వేగంగా చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### చెల్లింపులకు మించి సేవలు

యూపీఐ విజయాల తర్వాత భారత ఫిన్‌టెక్ రంగం చెల్లింపులకు మించి ఇతర ఆర్థిక సేవలపై దృష్టి పెట్టాలని ప్రధాని సూచించారు. బీమా, ఆర్థిక సేవల్లో డిజిటల్ టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన నియంత్రణ వ్యవస్థతో పాటు ఆవిష్కరణలకు అనుకూలమైన ఫిన్‌టెక్ పర్యావరణ వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. యూపీఐ కేవలం సాంకేతిక విజయగాథ మాత్రమే కాదని, ఇది ఒక నాగరికతకు సంబంధించిన కథ అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ గతంలో చేసిన వ్యాఖ్యలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

### సైబర్ భద్రతకు ప్రాధాన్యం

ఫిన్‌టెక్ రంగం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ భద్రత కూడా అత్యంత



కీలకంగా మారుతోందని మోదీ అన్నారు. ప్రపంచస్థాయి సైబర్ సెక్యూరిటీ పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై ఫిన్‌టెక్ రంగం దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వినియోగదారుల డేటా రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకోసం నైతిక డేటా రక్షణ ప్రమాణాలను రూపొందించాలని చెప్పారు.

### అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత్‌పై విశ్వాసం

ప్రపంచం ప్రస్తుతం సంఘర్షణలు, అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఇంధనం, నిత్యావసర వస్తువుల సరఫరా గొలుసులు ఒత్తిడికి గురవుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లోనూ భారత్‌పై అంతర్జాతీయ విశ్వాసం పెరుగుతోందని అన్నారు. జపాన్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారతదేశ రేటింగ్‌ను 'BBB+' నుంచి 'A–'కు పెంచడాన్ని ఆయన ప్రస్తావించారు. గత మూడు దశాబ్దాల్లో ఇలాంటి అప్‌గ్రేడ్ జరగడం ఇదే తొలిసారని పేర్కొంటూ.. ఇది భారత్‌పై ప్రపంచానికి పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని మోదీ అన్నారు.

# ఎడారిలో కృత్రిమ నది.. సౌదీ అరేబియా అద్భుతం

**దుబాయ్:** చుట్టూ ఎడారి.. సహజసిద్ధమైన నదీ వ్యవస్థ లేదు.. వర్షపాతం కూడా అత్యల్పమే. వేసవిలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటుతాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ కోట్లాది మందికి నిత్యం తాగునీటిని అందిస్తోంది సౌదీ అరేబియా. ఇందుకోసం ఆ దేశం సముద్ర జలాలను శుద్ధి చేసి, వాటిని వందల కిలోమీటర్ల దూరంలోని నగరాలకు తరలించే భారీ పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ప్రపంచంలోని అత్యంత పొడి ప్రాంతాల్లో ఒకటైన సౌదీలో ఇది ఓ కృత్రిమ నదీ వ్యవస్థను తలపిస్తోంది.

### సముద్ర జలాలే ప్రధాన ఆధారం

సౌదీ అరేబియాలో జనాభాలో అధిక శాతం ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్ తీర ప్రాంతాలకు సమీపంలో నివసిస్తున్నారు. దేశంలో సహజ నీటి వనరులు పరిమితంగా ఉండటంతో తాగునీటి అవసరాల కోసం సముద్ర జలాలపై ఆధారపడు తోంది. ఇందుకోసం తీర ప్రాంతాల్లో భారీ సంఖ్యలో డీశాలినేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. సముద్రపు ఉప్పునీటిని శుద్ధి చేసి తాగునీటిగా మార్చిన అనంతరం.. ప్రత్యేక పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా తీర ప్రాంతాల నుంచి నగరాలు, జనావాసాలకు తరలిస్తున్నారు. దీంతో సహజ నదులు లేని ప్రాంతాల్లోనూ నిరంతర తాగునీటి సరఫరా సాధ్యమవుతోంది.

### ఎడారిలో పైప్‌లైన్ నిర్మాణం ఎలా?

మండే ఎండలు, ఇసుక నేల, రాతి ప్రాంతాలు, పర్వతాలు.. ఇలా ఎన్నో సవాళ్ల మధ్య ఈ భారీ పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించారు. దీర్ఘకాలం మన్నికగా ఉండేందుకు చమురు, గ్యాస్ పైప్‌లైన్లలో ఉపయోగించే అధిక సామర్థ్యం కలిగిన కార్బన్ స్టీల్‌ను వినియోగించారు. పైపులను అమర్చే ముందు అల్ట్రాసోనిక్ పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించారు. తుప్పు పట్టకుండా ప్రత్యేక పూతలు వేశారు. అనంతరం భారీ వాహనాల్లో వాటిని ఎడారి ప్రాంతాలకు తరలించి అమర్చారు. పైప్‌లైన్ మార్గాన్ని నిర్ణయించేందుకు జీపీఎస్, అధునాతన సర్వే పరికరాలను ఉపయోగించారు. పర్వతాలు ఎదురైన చోట అవసరమైన మేరకు కందకాలు తవ్వి.. వాటిలో పైపులను అమర్చారు. ఒక్కో పైపు భాగాన్ని మరొకదానితో అనుసంధానిస్తూ భారీ నెట్‌వర్క్‌ను నిర్మించారు.

### సముద్రం నుంచి నగరాల వరకు..

ఈ మొత్తం వ్యవస్థలో డీశాలినేషన్ ప్లాంట్లు కీలక పాత్ర పోషిస్తాయి. సముద్రపు నీటిని ప్లాంట్లలోకి తీసుకురావడానికి తీరానికి కొంత దూరంలో భారీ ఇన్‌టేక్ పైపులను ఏర్పాటు చేశారు. ఉదాహరణకు 63 సెంటీమీటర్ల వ్యాసం కలిగిన ఒక పైపు రోజుకు సుమారు 1.5 కోట్ల లీటర్ల నీటిని పంప్ చేయగలదు. సముద్ర జీవులు ప్లాంట్లలోకి ప్రవేశించకుండా ప్రత్యేక రక్షణ తెరలను ఏర్పాటు చేశారు. చేపలు, పీతలు, జెల్లీ ఫిష్ వంటి జీవులను అడ్డుకున్న అనంతరం నీటిని వివిధ దశల్లో ఫిల్టర్ చేస్తారు.

### ఖనిజాలను తిరిగి కలిపి.. తాగునీటిగా

డీశాలినేషన్ ప్రక్రియ తర్వాత నీటిలో సహజంగా ఉండే పలు ఖనిజాలు చాలా వరకు తొలగిపోతాయి. దీంతో నీటి రుచి మారే అవకాశం ఉంటుంది. అందుకే కాల్షియం, మెగ్నీషియం వంటి అవసరమైన ఖనిజాలను తిరిగి కలుపుతారు. నీరు తాగడానికి అనువుగా ఉండేలా పీహెచ్ స్థాయిని కూడా సర్దుబాటు చేస్తారు. అయితే సముద్రపు నీటిని శుద్ధి చేయడం, వందల కిలోమీటర్ల దూరానికి తరలించడం అత్యంత ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. పైప్‌లైన్ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు అవసరం. అయినప్పటికీ సహజ నీటి వనరులు పరిమితంగా ఉన్న సౌదీ అరేబియా ఈ వ్యవస్థను జాతీయ మౌలిక సదుపాయాల్లో కీలక భాగంగా అభివృద్ధి చేసింది.

# పినరయి విజయన్‌పై ఎఫ్ఐఆర్ కోరిన ఈడీ!

**కొచ్చిన్:** కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసు కేరళ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి., అల్లుడు, మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేరళ డీజీపీకి లేఖ రాసినట్లు అధికారిక వర్గాలు మంగళవారం వెల్లడించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని ఈడీ కోరినట్లు సమాచారం. సోదాలు, దర్యాప్తులో లభించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం ఈ చర్యకు ఈడీ ముందుకొచ్చినట్లు అధికారులు తెలిపారు.

### రూ.2.73 కోట్ల చెల్లింపులపై ఆరోపణలు

కేరళకు చెందిన మైనింగ్ సంస్థ సీఎంఆర్ఎల్.. వీణకు చెందిన 'ఎక్సాలాజిక్ సొల్యూషన్స్'కు ఐటీ కన్సల్టెన్సీ సేవల పేరుతో సుమారు రూ.2.73 కోట్లు అక్రమంగా చెల్లించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి తిరువనంతపురంలోని విజయన్, వీణ నివాసాల్లో జూన్‌లో సోదాలు నిర్వహించిన ఈడీ.. అనంతరం దర్యాప్తును కొనసాగించింది.వీణ నివాసంలో నిర్వహించిన సోదాల్లో కొన్ని చేతిరాత పత్రాలు స్వాధీనం చేసుకున్నామని ఈడీ గతంలో వెల్లడించింది. వాటిలో దుబాయ్‌కు జరిగిన కొన్ని నిధుల బదిలీలకు సంబంధించిన వివరాలు ఉన్నట్లు తెలిపింది.

### వీణపై ఇప్పటికే మనీలాండరింగ్ దర్యాప్తు

సీఎంఆర్ఎల్–ఎక్సాలాజిక్ వ్యవహారం 2023లో వెలుగులోకి వచ్చింది. రెండు సంస్థల మధ్య ఒప్పందం ఉన్నప్పటికీ, అది వాస్తవ సేవలకు సంబంధించినది కాదని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) ఆరోపించినట్లు దర్యాప్తు వివరాలు వెల్లడించాయి. 2017 నుంచి 2020 మధ్య సీఎంఆర్ఎల్ నుంచి వీణకు చెందిన సంస్థకు సుమారు రూ.1.72 కోట్లు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎల్ తన 15 ఏళ్ల కార్యకలాపాల కాలంలో సుమారు రూ.182 కోట్ల మేర కల్పిత నగదు ఖర్చులను చూపించి పలువురికి చెల్లింపులు చేసినట్లు ఎస్ఎఫ్ఐఓ ఆరోపించింది. రవాణా సేవల పేరుతో సంస్థ ప్రమోటర్ ఎస్.ఎన్. శశిధరన్ కర్త, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన సంస్థలకు సుమారు రూ.91 కోట్లు చెల్లించినట్లు కూడా దర్యాప్తులో పేర్కొంది. 2012–13 నుంచి 2018–19 ఆర్థిక సంవత్సరాల మధ్య సీఎంఆర్ఎల్ తన ఖర్చులను సుమారు రూ.133.82 కోట్ల మేర పెంచి చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రవాణా, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాల పేరుతో బోగస్ నగదు ఖర్చులను ఖాతాల్లో నమోదు చేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

# బుల్లెట్ ట్రైన్ కీలక దశకు.. వచ్చే ఏడాది పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు, భద్రతా తనిఖీలు పూర్తయిన తర్వాత దశలవారీగా వాణిజ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పారు. ముందుగా 2027లో సూరత్–బిలిమోరా మధ్య బుల్లెట్ రైలు సేవలను ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మొత్తం కారిడార్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వడోదర నుంచి ముంబయికి ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని పేర్కొన్నారు. బుల్లెట్ ట్రైన్‌లో వడోదర నుంచి ముంబయికి సుమారు గంటన్నరలోనే చేరుకోవచ్చని తెలిపారు.

### సూరత్–వాపి పనులు వేగంగా

బుల్లెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రైల్వే మంత్రి చెప్పారు. ముఖ్యంగా సూరత్–వాపి సెక్షన్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టులోని వివిధ విభాగాల్లో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. భారత్ స్వదేశీ సాంకేతిక, తయారీ సామర్థ్యాలను పెంచుకునే దిశగా ఈ ప్రాజెక్టు కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### రైల్వేల్లో సమగ్ర ఆధునికీకరణ

భారతీయ రైల్వేల్లో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నామని వైష్ణవ్ తెలిపారు. నిర్వహణ వ్యవస్థ, రిజర్వేషన్ విధానాల నుంచి మౌలిక సదుపాయాల అభివృద్ధి వరకు అనేక అంశాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు.

### కీలక ప్రాజెక్టులు పూర్తి

దేశంలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేశామని మంత్రి చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని చెనాబ్ వంతెన, మిజోరంను రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టులను ఇందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేశామని, సుమారు 36,000 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్‌లను అభివృద్ధి చేశామని వెల్లడించారు. వందే భారత్ సాంకేతికత ఆధారంగా కార్గో రైళ్ల తయారీ కూడా కొనసాగుతోందన్నారు. కరోనా సమయంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేశామని వైష్ణవ్ తెలిపారు. ఆధునిక భారతీయ రైల్వే వ్యవస్థ భవిష్యత్ తరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ మహారాష్ట్ర, గుజరాత్, కేంద్రపాలిత ప్రాంతమైన దాద్రా–నగర్ హవేలీ మీదుగా సాగుతుంది. ముంబయి–అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. పూర్తి కారిడార్ అందుబాటులోకి రాకముందే సూరత్–బిలిమోరా సెక్షన్‌ను ప్రారంభించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# గూండాగిరిని ప్రోత్సహిస్తున్నారా?

(మొదటి పేజీ తరువాయి)



దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. మంగళవారం వివిధ జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులు కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. వారికి అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. 2024లో కానిస్టేబుల్ నియామకాల సందర్భంగా జీవో నంబర్ 31 ద్వారా రెండేళ్ల వయోపరిమితి పెంపు ప్రకటించినప్పటికీ.. నోటిఫికేషన్ ఆలస్యం చేయడం వల్ల ఇప్పుడు నాలుగేళ్ల వయోపరిమితి పెంపు అవసరమైందన్నారు. కానీ ప్రభుత్వం గతంలో ప్రకటించిన రెండేళ్ల పెంపును కూడా తొలగించడంతో లక్షలాది మంది అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

### నిరుద్యోగులను మోసం చేయడమే..

రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని కవిత విమర్శించారు.
జిల్లాకు 200 పోస్టులు కూడా దక్కని పరిస్థితిలో లక్షలాది మంది అభ్యర్థులకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. మొత్తం 20 వేల ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉద్యోగాల విషయంలో హోంశాఖ ఒకటి, ప్రభుత్వం మరొకటి చెబుతున్నాయని ఆరోపిం చారు. నిరుద్యోగుల తరఫున తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.



# ఎమ్మెల్సీ వ్యాఖ్యలతో భగ్గుమన్న కాంగ్రెస్

- దిష్టిబొమ్మ దహనం
- కెసిఆర్, మధుసూదన్, కేటీఆర్, ఫోటోలకు చెప్పుల దండ వేసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజానావ, మంచిర్యాల : అసెంబ్లీ స్పీకర్ గారి పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చెన్నూర్ పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఎమ్మెల్యే ఆఫీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తాతా మధుసూదన్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గారి పై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవులకు, వాటిలో ఉన్న వ్యక్తులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికకు సంబంధించిన అంశాల్లో ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలని, హుందాగా వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి స్పీకర్ గారి పై ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్ గారికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వెలుగులకు సింగరేణి భరోసా

- స్వరాష్ట్ర విద్యుత్ అవసరాలకే 90 శాతం గ్గ సరఫరా
- ఇతర రాష్ట్రాల నుంచి భారీ డిమాండ్ ఉన్నా తెలంగాణకే తొలి ప్రాధాన్యం

ప్రజానావ, హైదరాబాద్: దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు అవసరాలు అధికమవుతున్నప్పటికీ సింగరేణి కాలరీస్ సంస్థ తెలంగాణ విద్యుత్ అవసరాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి సింగరేణి బొగ్గు కోసం భారీగా డిమాండ్ వస్తున్నా.. స్వరాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్న విధానంతో తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన బొగ్గును సింగరేణి అందిస్తోంది. విద్యుత్ రంగానికి అండగా నిలుస్తూ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి సంస్థ కీలకంగా మారుతోంది.

## ప్రతి పది టన్నుల్లో తొమ్మిది తెలంగాణకే

గత ఆగస్టు నెలలో సింగరేణి దేశంలోని విద్యుత్ సంస్థలకు 40,51,312 టన్నుల బొగ్గును సరఫరా చేయగా, అందులో 36,25,937 టన్నులు తెలంగాణలోని విద్యుత్ సంస్థలకే రవాణా చేసింది. అంటే విద్యుత్ రంగానికి సరఫరా చేసిన బొగ్గులో దాదాపు 90 శాతం తెలంగాణకే అందించింది. సింగరేణి రోజుకు సగటున 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయగా, తెలంగాణ థర్మల్ కేంద్రాలకు రోజుకు సగటున 1,16,966



టన్నులు అందించింది.

## తెలంగాణ జెన్కోకు 50 శాతం సరఫరా

ఆగస్టులో తెలంగాణ జెన్కోకు 382 రైల్వే రేకుల ద్వారా మొత్తం 20,16,356 టన్నుల బొగ్గును సింగరేణి రవాణా చేసింది. రాష్ట్ర విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసిన బొగ్గులో ఇది సుమారు 50 శాతం కావడం విశేషం. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్కు 6,99,661 టన్నులు, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 7,99,017 టన్నులు, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్కు 1,02,959 టన్నులు, భద్రాద్రి థర్మల్ ప్లాంట్కు 4,14,719 టన్నుల బొగ్గును సరఫరా చేసింది. అలాగే రామగుండం ఎన్టీపీసీ ప్లాంట్లకు 7,28,164 టన్నులు, ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్కు 4,15,839 టన్నులు, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (జైపూర్)కు 4,65,579 టన్నుల బొగ్గును సరఫరా చేసింది.

## ఇతర రాష్ట్రాల నుంచి భారీ డిమాండ్

దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో సింగరేణి బొగ్గుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా డిమాండ్ వస్తోంది. పశ్చిమ బెంగాల్లోని దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) 10 లక్షల టన్నులు, దుర్గాపూర్లోని ఎన్టీఈసీఎల్ 12 లక్షల టన్నులు, ఎన్ఎస్పీసీఎల్–ఝుజ్జర్ 10 లక్షల టన్ను లు, తమిళనాడులోని ఎన్టీఈసీఎల్ 20 లక్షల టన్నుల బొగ్గు కోసం సింగరేణిని కోరుతున్నాయి. అయితే వాణిజ్యపరంగా ఈ అవకాశాలను వినియో గించుకునే అవకాశం ఉన్నప్పటికీ.. రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల డిమాండ్లను పక్కనపెట్టి తెలంగాణ థర్మల్ విద్యుత్ కేంద్రాలకే బొగ్గు సరఫరాకు సింగరేణి ప్రాధాన్యం ఇస్తోంది.

## నైనీ బొగ్గును కూడా తెలంగాణకే

ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును కూడా సింగరేణి స్వరాష్ట్ర అవసరాలకు తరలిస్తోంది. ఇప్పటికే సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్కు ఒక్కో రైల్వే రేకును సరఫరా చేసింది. నైనీలో ప్రస్తుతం 15 లక్షల టన్నుల బొగ్గు వెలికితీతకు సిద్ధంగా ఉన్నప్పటికీ, రైల్వే సైడింగ్కు రాత్రి వేళల్లో మాత్రమే బొగ్గు రవాణాకు అనుమతి ఉండటంతో సరఫరాను మరింత పెంచడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ నైనీ బొగ్గును కూడా తెలంగాణ ప్రయోజనాలకే వినియోగిస్తున్నారు.

## నిరంతర సరఫరా కోసం ప్రత్యేక అధికారుల నియామకం

రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి సహా ఇంధన సంస్థలతో ఉన్నతస్థాయి సమన్వయ సమావేశాలు నిర్వహించి తగినంత బొగ్గు సరఫరాపై మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచుతోంది. నాణ్యమైన బొగ్గును సకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు చేరవేసేందుకు సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఐదుగురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించారు. వారి పర్యవేక్షణలో బొగ్గు ఉత్పత్తి, సీహెచ్పీల ద్వారా సరఫరా, రైల్వే రేకుల సమీకరణ, రవాణా ప్రక్రియల ను వేగవంతం చేస్తున్నారు. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాలకు బొగ్గు సరఫరాను తగ్గించినట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది.

# శ్రీగాథలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**ప్రజానావ, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం శ్రీ గాద గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇంటి గృహాన్ని కాంగ్రెస్ నాయకులు పర్శ హనుమాన్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. గ్రామానికి చెందిన వేముల స్వరూప కాశాగౌడ్ ల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ప్రతి ఒక్కటి ప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బందెల రాజు, ఏఎంసీ డైరెక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్ రావు లతోపాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల నిరసన

**ప్రజానావ, గంభీరావుపేట:** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు నిరసిస్తూ మంగళవారము గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో ముందుగా అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిఆర్ఎస్ నాయకులకు చట్టసభలు నిర్వహించే స్పీకర్ పై కూడా గౌరవం లేదని మండిపడ్డారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ప్రభుత్వము చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల జిల్లా కాంగ్రెస్ నాయకులు బంగ్లా రాజు గౌడ్, గాంద్ల బాలలక్ష్మి, మల్యాల రాజేశ్వర్, టేకుమళ్ళ ప్రవీణ్, రామకృష్ణ, తాజుద్దీన్, తాహిర్, నరేశ్ వర్మ, లత, రాజు గౌడ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.




## ఎర్రవల్లిలో రణరంగం..
# పోటాపోటీ నిరసనలు!

- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం.. అడ్డుకున్న పోలీసులు.. కేటీఆర్, హరీశ్రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్టు

**ప్రజానావ, సిద్దిపేట:** డప్పు చప్పుళ్లు.. పోటాపోటీ నిరసనలు.. తోపులాటలు, పరస్పర దాడుల యత్నాలతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి పరిసర ప్రాంతాలు రణరంగంగా మారాయి. శాసనసభాపతిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ మంగళవారం కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి ప్రయత్నించింది. ఉమ్మడి మెదక్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి డప్పుల మోతతో ఫాంహౌస్ను నాలుగువైపుల నుంచి ముట్టడించేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుంభం అనిల్కుమార్రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్యలు ఫాంహౌస్ వైపు వస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్రావు, ఎమ్మెల్యేలు సికింద్రాబాద్ సమీపంలోని బొల్లారం చౌరస్తా నుంచి పాదయాత్రగా బయలుదేరారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు వారినీ నిలువరించారు.

## నలువైపుల నుంచి ముట్టడికి యత్నాలు

ఫాంహౌస్కు వెళ్లే ఎర్రవల్లి, వరదరాజ్పూర్, దామెరకుంట, రాజీవ్ రహదారి మార్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు ముట్టడికి బయలుదేరాయి. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్లోని హరిత హోటల్ వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి డప్పులతో వచ్చిన కార్యకర్తలతో కలిసి జగదేవ్పూర్ వెళ్లే మార్గంలో అలీరాజ్పేట్, ఇటిక్యాల మీదుగా వరదరాజ్పూర్కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు కూడా వారికి జత కలిశారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, రోప్ పార్టీలను దాటుకుంటూ వ్యవసాయ క్షేత్రం మలుపు వద్దకు చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో దాదాపు గంటపాటు పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మరోవైపు దామెరకుంట మార్గంలోనూ కేసీఆర్ ఫాంహౌస్ను ముట్టడించేందుకు ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. గణేశ్పల్లి నుంచి నర్సన్నపేట మీదుగా హుస్నాబాద్, సిద్దిపేట, మానకొండూరు, దుబ్బాక ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బస్సుల్లో తరలివచ్చారు. వారిని ఎర్రవల్లి గ్రామంలోని పాఠశాల వద్ద పోలీసులు అడ్డుకుని నిలిపివేశారు.



## ఏఐకి వ్యతిరేకంగా
# రోబోల నిరసన

- మానవ ఉద్యోగాలకు ఆటోమేషన్ ముప్పుపై ఆందోళన
- కఠిన నిబంధనలు కోరుతూ పోలాండ్లో 30 రోబోల ప్రదర్శన

ప్రజానావ, న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) నియంత్రణ, ఆటోమేషన్ కారణంగా మానవ ఉద్యోగాలకు ఎదురవుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఏకంగా రోబోలే వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టిన వింత ఘటన పోలాండ్లో చోటుచేసుకుంది. వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమే. పోలాండ్ రాజధాని వార్సాలో సోమవారం డిజిటల్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యాలయం వెలుపల సుమారు 30 రోబోలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. హ్యూమనాయిడ్ రోబోలు, రోబో కుక్కలు పాల్గొన్న ఈ అసాధారణ ప్రదర్శనలో ఏఐ వినియోగానికి సంబంధించి మరింత కఠినమైన నిబంధనలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'మెమోక్రటిజం' అనే వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో రోబోలు వలయాలుగా కదులుతూ కవాతు నిర్వహించాయి. చేతుల్లో జెండాలు పట్టుకుని ఊపుతూ, లౌడ్స్పీకర్ల ద్వారా నినాదాలు ప్రసారం చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశాయి. ఏఐ, రోబోటైజేషన్ కారణంగా కార్మిక మార్కెట్పై పడుతున్న ప్రభావంపై విస్తృత చర్చకు తెరతీయడమే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ వినూత్న నిరసనలో ఏఐ ఆధారంగా పనిచేసే హ్యూమనాయిడ్ రోబో 'అగిబోట్ ఏ3'తో పాటు రెండు కాళ్లపై నడిచే వివిధ హ్యూమనాయిడ్ రోబోలు, కుక్కలను పోలిన నాలుగు కాళ్ల యంత్రాలు కూడా పాల్గొన్నాయి. మానవుల ఉద్యోగాలను ఆటోమేషన్ ఎంతవరకు ప్రభావితం చేస్తోంది, భవిష్యత్తులో ఏఐ ఆధారిత యంత్రాల విస్తరణ వల్ల ఉపాధి అవకాశాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది, వాటి నియంత్రణకు ఎలాంటి నిబంధనలు అవసరం అనే అంశాలపై ప్రజల్లో అవగాహన, చర్చ పెంచే లక్ష్యంతో ఈ వినూత్న నిరసన చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# స్పీకర్పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు బాధాకరం

- ఇప్పటికీ దళితులపై వివక్షపూరిత ధోరణి ఉండటం అన్యాయం
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకురాలు సురారపు కృష్ణవేణి




**ప్రజానావ, హైదరాబాద్ :** అసెంబ్లీ సమావేశాల తొలి రోజునే సభ ఆవరణలో చోటుచేసుకున్న పరిణామాలు జుగుప్సాకరంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకురాలు సురారపు కృష్ణవేణి ఆవేదన వ్యక్తం చేశా రు. బంజారాహిల్స్లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ను అవమా నించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తోందని కృష్ణవేణి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా దళితులు ఎంత ఉన్నత పదవుల్లో ఉన్నప్పటికీ వారిపట్ల వివక్షపూరిత ధోరణి కొనసాగడం అన్యాయమని అన్నారు. స్పీకర్పై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా ఉందని ఆమె ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యలకు వేదికగా సభను మార్చాలి

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ వివాదాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సభ ఔచిత్యం దెబ్బతింటోందని కృష్ణవేణి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు శాసనసభను సమర్థవంతమైన వేదికగా వినియోగించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై వివక్ష పూర్తిగా తొలగాలంటే సామాజిక న్యాయ తెలంగాణ సాకారం కావాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తమ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంకల్పంతో ముందుకు సాగుతూ పోరాటం చేస్తున్నారని కృష్ణవేణి తెలిపారు.



# అవమానించారంటూ మాజీ ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి యత్నం

## 14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

**ప్రజానావ, పెద్దపల్లి :** పింఛన్లు ఇప్పిస్తామని ఆశ చూపి మహిళలను పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి అవమానించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. 14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసనతో మంగళవారం పెద్దపల్లిలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళలకు నెలకు రూ.2,500 పింఛన్ వస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు ఇదే చివరి తేదీ అంటూ ఆశ చూపి కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి డ్రామాలు ఆడారని కౌన్సిలర్ అస్లాం పర్వేజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో మహిళలు తీవ్రంగా అవమానానికి గురయ్యారని ఆయన ఆరోపించారు. దీనికి నిరసనగా అస్లాం పర్వేజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు కలిసి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముట్టడి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అస్లాం పర్వేజ్కు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముట్టడికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేయడంతో చివరకు ఆందోళనకారులు వెనుదిరిగారు. దీంతో కొంతసేపు నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి.

# కాంగ్రెస్ విఫల పాలనపై పోరుబాట విజయవంతం

- ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్రెడ్డి

ప్రజానావ, పెద్దపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్నివర్గాలను మోసం చేసిందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలు వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "పోరుబాట" కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో దాసరి మనోహర్రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు స్కూటీ, రైతులకు అనేక హామీలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి తదితర పథకాల విషయంలో ఎన్నో హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందనన్నారు. ఆరు గ్యారంటీలు – 420 హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.



వెయ్యి రోజుల పాలనలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, కార్మికులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, మౌలిక వసతులు వంటి స్థానిక సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళల సమస్యలు, రైతుల సమస్యలు, విద్యార్థులు –యువత సమస్యలు, ఆరు గ్యారంటీల వైఫల్యం, స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య సమస్యలు, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే బిఆర్ఎస్ పోరుబాట ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, హామీల అమలు జరిగే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల హామీలను గుర్తు చేసుకోవాలని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాలను చేపడతామని మనోహర్ రెడ్డి హెచ్చరించారు. వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పనిచేశాయని, పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని, bi ప్రజల పక్షాన ఎప్పటికీ నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## అంబేద్కర్ విగ్రహానికి వినతి

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలనకు 420 హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ఆరు గ్యారెంటీల విస్మరణ పై అంబేద్కర్ విగ్రహానికి ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి పత్రం సమర్పించారు.

# సిరిసిల్లలో బీఆర్ఎస్ నాయకుల భారీ నిరసన, ధర్నా, రాస్తారోకో

- సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం, అడ్డుకున్న పోలీసులు
- గ్యారంటీలు, హామీలు అమలు చేయించాలని అంబేద్కర్కు వినతి



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనేక అంబేద్కర్ చౌకలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి పార్టీ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు, హామీలను ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను నెరవేరుస్తానని చెప్పి విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలు వెంటనే నెరవేర్చాలని డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలను అందిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ నాయకులు పాల్గొన్నారు.



# పెరుగుతున్న సైబర్ మోసాలు

తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్ లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో ఇద్దు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ ఐడీ, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ.4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుండటం, ఆ ప్రాసెస్లో వెళ్లే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు.

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏదో ఒక చోట ఏదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్ లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో ఇద్దు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ ఐడీ, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ.4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్లో వెళ్లే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవు తోంది, ఇలాంటి జరగకుండా నిరోధించేలా మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి చెప్పారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను దా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ జర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చరిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఒలి (పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజను కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఓ ఈమెయిల్ ఐడీ నుంచి ఒలికి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఒలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ పేజీ లింక్ ప్రైవేట్ మెసేజ్ యాపోర్టికి రమ్మని మెసేజ్ చేస్తారు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఒలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లు బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఒలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరాలను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే చాలా కొద్ది సమయం పడుతుందని, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఒలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ వచ్చాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లు డబ్బులు సంపాదించుకుంటున్నారు, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టుల ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది నేరపూరిత చర్య అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ జర్లు ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మెర్సిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అలిన్ టావ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్టులు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరిగినా చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్ల నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఏదేమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసు సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్టులు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరిగినా చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్ల నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది.

# వెయ్యి రోజులు.. హామీలు అమలు చేయలేదు!

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ధ్వజం
- అరెస్టులను ఖండిస్తూ రాజీనామాలకు సవాల్



ప్రజానావ, యాదాద్రి భువనగిరి: ఎన్నికలకు ముందు వంద రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామ కృష్ణారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమం ముగింపు సందర్భంగా భువనగిరిలో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజర య్యేందుకు వెళ్తున్న ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అరెస్టు చేసి బీబీనగర్‌కు తరలించారు. అనంతరం బీబీనగర్ మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతుబీమా కొనసాగింపు, వ్యవసా యానికి 24 గంటల విద్యుత్ తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు తూట్లు పొడిచిందని విమర్శిస్తూ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని, వికలాంగులకు రూ.6 వేలు, మహిళలకు నెలకు రూ.2,500, నిరుద్యోగు లకు భృతి అందిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆ హామీని సైతం విస్మరించిందని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పెట్టుకున్న నమ్మకాన్ని ప్రభుత్వం వమ్ము చేసిందని అన్నారు. దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరా యడమేనని అన్నారు. అసెంబ్లీ ఘటనల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరిం చారని ఆరోపించారు. ఒకవైపు ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తూ, మరోవైపు పోలీసుల దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమేనని, అయితే దాడులు, ప్రతిదాడుల సంస్కృతి మంచిది కాదని పేర్కొన్నారు. భువనగిరితో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదని, అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో ఓపికతో వ్యవహరిస్తున్నారని, కక్షసాధిం పు రాజకీయాలకు తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వానికి పనిగా మారిందని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు కోరుకునేది సంక్షేమం, అభివృద్ధి తప్ప వ్యక్తిగత విమర్శలు కాదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించి పాలన సాగించాలని ప్రభుత్వానికి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఇకనైనా చిత్తశుద్ధితో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివా సులు, మాజీ రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, నాయకులు పిట్టల అశోక్, మంచాల రవికుమార్, కొంతం లింగయ్యగౌడ్, అమృతం శివకుమార్, యాస సంతోష్‌రెడ్డి, జక్కి నగేష్, ఎర్ర శేఖర్‌రెడ్డి, ఎండీ మున్నా, దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పంజాల రామారావుగౌడ్, గాదె కవిత, చెన్న స్వాతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## తుంగతుర్తి విద్యుత్ ఏడీఈగా నరసింహ

ప్రజానావ, సూర్యాపేట: తుంగతుర్తి విద్యుత్ శాఖ ఏడీఈగా బానోతు నరసింహ మంగళవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తుంగతుర్తి ఏడీఈగా పనిచేసిన వనజ మునగాలకు బదిలీ కావడంతో, కోదాడలో పనిచేస్తున్న నరసింహ పదోన్నతిపై తుంగతుర్తికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నరసింహ మాట్లాడుతూ రైతులు, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏఈలు పుష్పగుచ్ఛాలు అందజేసి నరసింహకు ఘనంగా స్వాగతం పలికారు.

# ఎర్రవెల్లి వైపు బీఆర్ఎస్ నేతల పాదయాత్ర

- కేసీఆర్ నివాసంపై దాడి కుట్ర అంటూ ఆరోపణలు
- ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు, హకీంపేట వద్ద ఉద్రిక్తత

ప్రజానావ, హైదరాబాద్: ఎర్రవెల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ నివాసంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రవెల్లి వైపు వెళ్తున్నా పోలీసులు వారిని అడ్డుకోకుండా సహకరిస్తున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు విమర్శలు గుప్పించాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి పోలీసులు వంత పాడుతున్నారని ఆరోపిస్తూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ అరాచకపర్వం కొనసాగు తోందని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కేసీఆర్ నివాసంపై దాడికి కాంగ్రెస్ కార్యకర్తలు బయలుదేరిన విషయం తెలుసుకున్న కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నఫ ళంగా అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో హకీంపేట వద్ద పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాహనాలను అడ్డుకుని వారిని అదుపు లోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా ఇంటికి కూడా మేం వెళ్లవద్దా?' అంటూ పాడి కౌశిక్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించడంతో అక్కడ కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వాహనాలను ముందుకు వెళ్లనివ్వకపోవ డంతో బొల్లారం చౌరస్తా నుంచి కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఎర్రవెల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. మరోవైపు కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నామంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించారన్న ఆరోపణ లపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా స్పందిస్తున్నాయి. కేసీఆర్‌పై హత్యాయత్నానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంపై దాడికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలు గుంపులుగా వస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఎంతమంది పోలీసులను పంపుతారో పంపండి.. ఎంతమంది ఎమ్మెల్యేలు వస్తారో రండి.. తేల్చుకుంటాం' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు ఎర్రవెల్లి వైపు బయలుదేరినట్లు సమాచారం. దీంతో ఎర్రవెల్లి పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# విమానాశ్రయం కోసం భూముల పరిశీలన

- దుమ్ముగూడెం, బూర్గంపహాడ్‌లో ఏఏఐ సాంకేతిక బృందం పర్యటన
- వరద ముప్పు, భూమి స్వరూపం, సాయిల్ నాణ్యతపై అధ్యయనం



ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూ డెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి చెందిన బహుళ విభాగాల సాంకేతిక బృందం మంగళవారం దుమ్ముగూ డెం, బూర్గంపహాడ్ మండలాల్లో పర్యటించింది. జిల్లాలో ఇప్పటికే ఆరు ప్రాంతాలను విమానాశ్రయ నిర్మాణానికి పరిశీలనలోకి తీసుకోగా, దుమ్ముగూడెం మండలంలోని అర్లగూడెం, పెద్ద కమలాపురం, కమలాపురం, ఎర్రబోరు, కొత్తూరు తదితర ప్రాంతాల్లోని భూములను ఏఏఐ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన వివిధ సాంకేతిక అంశాలను పరిశీలించిన బృంద సభ్యులు భూమి స్వరూపం, సాయిల్ నాణ్యత, వరద ముప్పు, విద్యుత్ లైన్లు, భౌగోళిక పరిస్థితులు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా పరిశీలించిన ప్రాంతాల్లో భూమి పూర్తిగా సమతలంగా ఉండటం, పెద్దగా గుట్టలు లేకపోవడం, హైటెన్షన్ విద్యుత్ లైన్లు లేకపోవడం వంటి అంశాలను పరిశీలించారు. ఈ ప్రాంతం వరద ప్రభావానికి లోనయ్యే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు సమీపంలో ఉండటం, సుమారు 15 కిలోమీటర్ల పరిధిలోనే ఇతర రాష్ట్రాల సరిహద్దులు ఉండటం వల్ల రవాణా పరంగా ఈ ప్రాంతానికి ఉన్న అనుకూలతలను కూడా సాంకేతిక బృందం పరిశీలించింది. విమానాశ్రయ నిర్మాణానికి భూమి అనుకూలతలో కీలకమైన మట్టి (సాయిల్) నాణ్యతను సైతం అధికారులు పరిశీలించారు. భూమికి సంబంధించిన సాయిల్ పరిస్థితి బాగుందని సంబంధిత శాఖల అధికారులు సాంకేతిక బృందానికి వివరించినట్లు సమాచారం. ఏఏఐ బృందం భూమి స్వరూపం, సాయిల్ పరిస్థితి, వరద ముప్పు, విద్యుత్ లైన్లు, భౌగోళిక పరిస్థితులు, ఇతర సాంకేతిక అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వివరాలను నోట్ చేసుకుంది. పూర్తి స్థాయి సాంకేతిక పరిశీలన అనంతరం తదుపరి వివరాలను వెల్లడిస్తామని బృంద సభ్యులు తెలిపినట్లు సమాచారం. ఈ పరిశీలనకు కొత్తగూడెం ఆర్డీవో మధు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏఏఐ బృందానికి సహకరించారు. విద్యుత్ శాఖ ఏఈ మోహన్‌రెడ్డి, గనుల శాఖ అధికారులు, ఇరిగేషన్ ఏఈ సూర్యం, దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, జియాలజిస్టులు తదితరులు క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్నారు.

### పుష్కరవనం వద్ద భూముల పరిశీలన

ఇదిలా ఉండగా బూర్గంపహాడ్ మండలం సారపాక పంచాయతీ పరిధిలోని పుష్కరవనం సమీపంలోనూ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన భూములను ఏఏఐ బృందం మంగళవారం పరిశీలించింది. కొత్తగూడెం ఆర్డీవో మధు పర్యవేక్షణలో అటవీ, రెవెన్యూ, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో కలిసి బృంద సభ్యులు భూముల పరిశీలన చేపట్టారు. విమానాశ్రయం ఏర్పాటుకు వరద ప్రభావం లేని భూములు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశంపై చర్చించి ఆయా ప్రాంతాలను పరిశీలించినట్లు బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎస్ఆర్ఓ శ్రీనివాస్, రెవెన్యూ శాఖ తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ట్రాన్స్‌కో ఏడీ నర్సింహారావు, ఏఈ గుర్రం ఉపేందర్, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

### శ్రావణమాసం చివరి రోజు ప్రత్యేక పూజలు
### సారె పంపిణీ, అన్నదానంతో ఆధ్యాత్మిక సందడి

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి రోజు కావడంతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు దుమ్ముగూడెం మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేకంగా సారె పంపిణీ చేశారు. చీర, జాకెట్, కుంకుమతో కూడిన సారెను అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం భక్తులకు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు దర్శనం, పూజలు, అన్నదానం తదితర కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బైరెడ్డి సతీష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హామీలు చదివితే పోలీసులకు ఫిర్యాదు

- కాంగ్రెస్ ఎన్నికల హామీలపై వ్యక్తి ప్రశ్నలు
- ఆగ్రహంతో పోలీసులను ఆశ్రయించిన కాంగ్రెస్ నేతలు

ప్రజానావ, మెదక్: ఎన్నికలకు ముందు అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై క్షేత్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొంటున్న ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని రంగంపేటలో ఓ వ్యక్తి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా చదువుతూ అవి అమలు కాలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 'మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నావ్.. అదేదిరా? వృద్ధులకు, బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామన్నావు.. అదెటుపోయింది? వికలాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇస్తామన్నావు.. అదెటుపోయింది?' అంటూ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ ప్రశ్నలు సంధించారు. గ్రామంలో నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చదివి వాటి అమలు తీరును ప్రశ్నించిన సదరు వ్యక్తిపై కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. హామీల అమలుపై ప్రశ్నించినందుకే పోలీసులకు ఫిర్యాదు చేశారంటూ దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసుల ఫిర్యాదు, తదుపరి చర్యలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 18.6 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

### రూ.9.33 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం: ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితుల ను బూర్గంపహాడ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఎస్ఐ మేడా ప్రసాద్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం బూర్గం పహాడ్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఎస్ఐ నాగభిక్షం ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టీవీఎస్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారు వెంట తీసుకెళ్తున్న రెండు బ్యాగులను పరిశీలించగా అందులో 18.6 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లాకు చెందిన నవీన్‌కుమార్, విజయ్‌కుమార్‌గా గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి 18.6 కిలోల గంజాయి తో పాటు రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ సుమారు రూ.9.33 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మేడా ప్రసాద్ వెల్లడించారు.

## చలో హైదరాబాద్‌కు ఉద్యోగుల కదం!

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్–హక్కుల సాధన సభ'కు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు తరలివెళ్లనున్నట్లు జిల్లా ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ ధరణికోట భగత్ తెలిపారు. సభకు లక్ష మందికి పైగా ఉద్యోగులను సమీకరించేలా కార్యాచరణ రూపొందించామని, భువనగిరి జిల్లా నుంచి సుమారు 10 వేల మంది ఉద్యోగులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం బీబీనగర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో 'చలో హైదరాబాద్–హక్కుల సాధన సభ' వాల్‌పోస్టర్‌ను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధరణికోట భగత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ న్యాయమైన డిమాండ్లేనని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నివేదికను స్వీకరించకపోవడం ఉద్యోగుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఈహెచ్ఎస్ జీవో అమలు కావడం లేదని, అనేక ప్రైవేట్ ఆస్పత్రులు సైతం ఈహెచ్ఎస్‌ను అంగీకరించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- ప్రతి కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లులో అవసరమైన హమాలీలను ముందుగానే ఏర్పాటు చేయాలి
- ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి.. ఓవర్‌లోడ్‌కు అనుమతించవద్దు
- ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష




ప్రజానావ, పెద్దపల్లి : ఖరీఫ్ 2026 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరా ములు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లులకు మ్యాపింగ్, రవాణా, హమాలీలు, గోదాముల లభ్యత, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, నాణ్యత ధ్రువీకరణ, బోనస్, చెల్లింపులు, ఏఐ సాంకేతికత వినియోగం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ ధాన్యం రవాణాకు ఏర్పాటు చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఉండాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వాహనం కదలికలను క్రమం తప్పకుండా ట్రాక్ చేయాలని, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రవాణా అవసరాల కోసం మాత్రమే ఆ వాహనాలను వినియోగించాలని ఆదేశించారు. వాహనాలను ఏర్పాటు చేసే కాంట్రాక్టర్లు ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం రవాణా చేసే వాహనాల్లో అధిక లోడును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, నిర్దేశిత సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే ధాన్యాన్ని రవాణా చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సీజన్‌లో హమాలీల సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు ప్రతి రైస్ మిల్లుకు అవసరమైన సంఖ్యలో హమాలీలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి, లోడింగ్, అన్‌లోడింగ్ తదితర ప్రక్రియ లకు అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించు కోవాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే మాయిశ్చర్ మీటర్లు, ధాన్యం శుభ్రపరిచే ప్యాడీ క్లీనర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోని తూకం యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో మెట్రాలజీ శాఖ అధికారులు ముందుగానే తనిఖీ చేసి ధ్రువీకరించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు కొనుగోలు ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తూకం, తేమ శాతం పరిశీలన, కొనుగోలు నమోదు, బోనస్, చెల్లిం పులు తదితర అంశాలపై వారికి అవసరమైన శిక్షణను ముందుగానే అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న రకాల ధాన్యానికి బోనస్ అంద నున్నందున, అర్హత కలిగిన ధాన్యానికి నిబంధనల ప్రకారం బోనస్ అందేలా నాణ్యతను ఏఈఓలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు ధ్రువీకరిం చాలని ఆదేశించారు. నాణ్యత ధ్రువీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులే కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రతిపాదించా లని సూచించారు. ప్రతిపాదించిన ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత రైస్ మిల్లులకు కేటాయించి, కొనుగోలు కేంద్రాల వారీగా మిల్లులకు అవసరమైన మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కేటాయింపు లకు సంబంధించి మిల్లర్లు తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఏఐ సాంకేతికతను వినియో గించనున్నామని, కొనుగోలు కేంద్రాల నుంచి అప్‌లోడ్ చేసే ఫొటోలు, వివరాలను సాంకేతికత ద్వారా పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు. పాత ఫొటోలను అప్‌లోడ్ చేసి ప్రస్తుత పరిస్థితులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేసినా సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. కాబట్టి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తాజా ఫొటోలు, వివరాలను మాత్రమే నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సంబంధిత ఆన్‌లైన్ వ్యవస్థలో ఎప్పటికప్పుడు, ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. రైతులకు చెల్లింపులు ఎలాంటి పొరపాట్లు లేకుండా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. గత సీజన్‌లో చెల్లింపులకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురైనందున, ఈ సీజన్‌లో అవి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ సీజన్ ధాన్యం నిల్వకు కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల గోదాం స్థలాన్ని ముందుగానే గుర్తిం చాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న గోదాముల స్థలాన్ని కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు కేటాయించకూడదని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వకు అవసరమైన గోదాం సామర్థ్యాన్ని ముందుగానే గుర్తించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబర్ 1 నుంచి పనిచేయాల్సి ఉన్నందున కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లులకు మ్యాపింగ్, హమాలీల నియామకం, రవాణా వాహనాల ఏర్పాటు, జీపీఎస్ ట్రాకింగ్, గోదాముల గుర్తింపు, అవసరమైన పరికరాల ఏర్పాటు, సిబ్బందికి శిక్షణ తదితర అన్ని ఏర్పాట్లను అక్టోబర్ 1కు ముందే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన తర్వాత రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిం చాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లను విజయవం తంగా నిర్వహించేందుకు ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను ముందుగానే పూర్తి చేసి, అక్టోబర్ 1నుంచి జిల్లాలోని అన్ని ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాల్లో సజావుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా అధికారులు సమగ్ర కార్యాచరణతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. అక్టోబర్ 1 ముఖ్య మంత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఒకేసారి ప్రారంభించను న్నారని తెలిపారు. అదే రోజు నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నందున జిల్లాలో ప్రతిపాదించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబర్ 1 నుంచే పనిచేసేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందు గానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావే శంలోజిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



శాంతియుత వాతావరణంలో..

## గణేష్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి

- గణేష్ పోర్టల్ - 2026లో మండపాల నమోదు తప్పనిసరి
- ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది తలెత్తకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి
- మండపాల వద్ద, నిమార్జనం రోజు డి.జే లకు అనుమతి లేదు

ప్రజానావ, సిరిసిల్ల : గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఈ మేరకు సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వహకులు స్థానిక కౌన్సిలర్లతో సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది నిమజ్జనం సందర్భంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించారు. జిల్లాలో అక్కడక్కడ ఇబ్బందులకు పాల్పడిన వారిపై 8 కేసులు నమోదు చేయడం జరిగిందని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు గణేష్ పోర్టల్ – 2026లో తమ మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిరిసిల్ల మానేరు తీరంలో ఏర్పాటు చేయనున్న నిమజ్జన ప్రదేశంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

### మండపాలు, శోభాయాత్రలో డీజేలకు.. అనుమతి లేదు

గణేష్ నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల వద్ద, శోభాయాత్ర నిమజ్జనం రోజున డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తే డీజే నిర్వాహకులతో పాటు సంబంధిత మండప నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీ నాగేంద్రచారి, సిఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకులు అందించాలి

- అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు రజిత డిమాండ్




ప్రజానావ, సిరిసిల్ల : రేషన్ షాపుల్లో చక్కెర, నిత్యవసర సరుకులు వెంటనే అందించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం సిరిసిల్లలో ఐద్వా నిరసన తెలుపుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చక్కర ధరలను తక్షణమే తగ్గించాలని, పేద ప్రజలపై ధరల భారాన్ని మోపుతూ ప్రజల కడుపు కొట్టే విధానాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలన్నారు. రేషన్ సరుకుల సరఫరా సక్రమంగా చేయని పక్షంలో ప్రజల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఆడెపు రజిత డిమాండ్ చేశారు.

## సిరిసిల్లలో కేసిఆర్, ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మల దహనం

- అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసులు, పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట, వాగ్వాదం.
- స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలపై సిరిసిల్ల గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన



ప్రజానావ, సిరిసిల్ల : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుర దేవరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేసిఆర్, తాత మధు ల రెండు దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. దిష్టిబొమ్మ దగ్ధం చేసే సమయంలో పోలీసులకు కాంగ్రెస్ నాయకులకు తోపులాట జరిగింది. నిరసనలో పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌పై తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడెపు చంద్రకళ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, జిల్లా ఆర్టిఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్కె రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, కౌన్సిలర్లు కూరపాటి శ్రీశైలం, లింగంపల్లి గంగ రాజు, పట్టణ ఉపాధ్యక్షులు బొప్ప దేవయ్య, నీలి రవీందర్, కత్తెర దేవదాసు, నేదురి లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దేవరాజ్ రెడ్డి, కాసర్ల రాజు, పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్‌పై వ్యాఖ్యలకు నిరసన

ప్రజానావ, జమ్మికుంట: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జమ్మికుంటలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్, పట్టణ అధ్యక్షుడు పాతకాల అనిల్ ఆధ్వర్యంలో తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని గౌరవించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తాత మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మొలుగురు సదయ్య, టిపిసిసి ప్రచార కమిటీ మెంబర్ సాయిని రవి, జమ్మికుంట కౌన్సిలర్ దిద్ది రాము, ఒగ్గు రమేష్, ఎస్సి సెల్ జనరల్ సెక్రెటరీ దొడ్డ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పార్లపల్లి నాగరాజు, జమ్మికుంట దుబ్బ మల్లన్న చైర్మన్ ముద్దమల్ల రవి, జిల్లా కార్యదర్శి మేకమాల అశోక్,ఎన్ఎస్ఐ మండల అధ్యక్షులు వాసాల సుధీర్, బోయిని రాజ్ కుమార్,రాచపల్లి శ్రీనివాస్, పంజాల అజయ్, కొండు బిక్షపతి, రోమాల రాజ్ కుమార్,శంకర్, నరసన్న,మైస రమేష్,అనిల్,పాతకల ప్రవీణ్, గుల్లి జపానియా, రమేష్, శివ, సతీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనపై డప్పులతో నిరసన

ప్రజానావ, పెద్దపల్లి : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి. పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట భారతీయ జనతా యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాలీ'చావు డప్పు' నిరసన చేసి జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ 'చావు డప్పు' కొట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నప్పటికీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యువమోర్చా నాయకులు పేర్కొన్నారు. విద్యార్థుల చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్యపై ప్రభావం పడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే




విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం యువమోర్చా నిరంతరం పోరాడుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలి. లేకపోతే విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మరింత ఉధృతంగా ఉదమాలు చేపడతాం" కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను నాయకులను అడ్డుకుంటాం పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఇంటిని ముట్టడిస్తాం ఎమ్మెల్యే ప్రభుత్వం ఇస్తా అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, ఒల్లే తిరుపతి, ఈర్ల శంకర్, కావేటి రాజగోపాల్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఉప్పు కిరణ్ రాజమహంత, పట్టణ ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్ బోలవేన సురేందర్, గాదాసి సతీష్, బొడ్డుపల్లి కుమార్, సబ్బు మల్లయ్య, పడాల శ్రీనివాస్ గౌడ్ వీరేశం గౌడ్, గడ్డం అనిల్, సుంకనపల్లి ఆంజనేయులు, ఇంజపురి సోనీ, పెద్దపల్లి యువ మోర్చా నాయకులు కుశానపల్లి మధుకరన్, కుక్క అంజి, పెద్దపల్లి మండల యువమోర్చా అధ్యక్షులు రెడ్ల వేణు, కాల్వ శ్రీరాంపూర్ మండల యువ మోర్చా అధ్యక్షులు దిలీప్ ఓదెల యువమోర్చా నాయకులు శాతల్లా కుమార్, సిలారపు మహేష్ కలవెల్లి నవీన్, మంద దేవరాజ్, పంది సాయి కుమార్, నూతి విరాట్, తుడి అఖిల్, లక్ష్మణ్ అఖిల్, తిప్పని నరేశ్ భాకం రాజు పూరెల్ల అభి ఓర్సుల రాజేశ్, హరీష్, నరేశ్, కళ్యాణ్, గుమ్మడి నరేష్, మోధుంపల్లి కళ్యాణ్, శంబోజు కల్యాణ్, కుందేళ్ళ శ్రీనివాస్, సంఘం వంశీ, జెట్టి రాకేష్, అలవేని జశ్వంత్, సంగం అభిషేక్, పుల్ల పరుశురాం, జాజి రాకేష్, వినోద్, హరీష్, పవన్, సందీప్, సుశాంత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును

## మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- డిజిటల్ సాంకేతికతను సద్వినియోగం చేసుకొని డేటా నమోదులో వేగం, ఖచ్చితత్వం పెంచాలి
- ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలి
- యూపీహెచ్‌సీ ఏఎన్‌ఎంలకు ట్యాబ్‌ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్‌సీ) లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాల నమోదును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లాలోని యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు మంగళవారం సమగ్రత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ ఆన్‌లైన్ కార్యక్రమాలు, సేవల వివరాలు, గర్భిణీల నమోదు, టీకాల వివరాలు, కుటుంబ సంక్షే మ కార్యక్రమాలు, ఆరోగ్య కార్యక్రమాల పురోగతి తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు సేకరించే ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డేటా నమోదులో వేగంతో పాటు ఖచ్చితత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీల నమోదు, టీకాల కార్యక్రమాలు, కుటుంబ సంక్షేమం, ప్రజారోగ్య కార్యక్రమాలు తదితర సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదయ్యే డేటా ఆధారంగా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని బాధ్యతగా నమోదు చేయాలని తెలిపారు. ఏఎన్‌ఎంలకు అందించిన ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా సమయం ఆదా కావడంతో పాటు, ఆరోగ్య కార్యక్రమాల అమలు, పర్యవేక్షణలో మరింత పారదర్శకత, ఖచ్చితత్వం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, యూపీహెచ్‌సీల వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటిపై ముందస్తు ప్రణాళికలు

- మండల ప్రత్యేక అధికారి హనుమంత్ నాయక్
- అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజానావ, గంభీరావుపేట: ఎలినినో ప్రభావం ఉన్న నేపథ్యంలో పలు గ్రామాల్లో తాగునీటికి ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి హనుమంత్ నాయక్ సూచించారు. మండల అభివృద్ధి అధికారి రాజేందర్ అధ్యక్షతన మంగళవారము గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ మూలంగా రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని పలు సమస్యలపై ఆయా గ్రామ సర్పంచ్ లు ఏకరువు పెట్టారు. రైతులకు అందుబాటులో యూరియా అందడం లేదని, నిరంతరం విద్యుత్ కోతవిధిస్తున్నారని, గ్రామాల్లో హెల్పర్ అందుబాటులో ఉండడం లేదని, లో వోల్టేజ్ మూలంగా మోటార్లు కాలిపోతున్నాయని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించిన ఫలితం లేదని పలు గ్రామాల సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేశారు, విద్యుత్ అధికారుల పనితీరుపై మండిపడ్డారు, నిత్యం గ్రామాల్లో 10 విద్యుత్ ఉండడం లేదని, నాణ్యమైన విద్యుత్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అసరా పెన్షన్ల గడువు సమీపిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరు ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేందర్ సూచించారు. దరఖాస్తు చేసుకున్న పెన్షన్ల తాలూకు సంబంధించిన వాటిపై ఈనెల 23 లోపు క్షేత్రస్థాయిలో పరిశీలన జరగనున్నట్లు తెలిపారు. పరిశీలన సమయంలో దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్ లు అర్జీదారులు అందుబాటులో ఉండే విధంగా వారికి ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో తహసిల్దార్ మారుతి రెడ్డి, ఎంపీ ఓ శ్రీనివాస్ లతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేములవాడలో భక్తజన సంద్రం

- బద్ది పోచమ్మకు బోనాలు
- 1.18 లక్షల మంది భీమేశ్వరుడి దర్శనం

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. నిన్న ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు 1,18,776 మంది భక్తులు శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి సన్నిధి మహిళా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు బోనాలు, ఒడిబియ్యం, చీర–సారె, బెల్లం, సాక, పట్నాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మను లక్ష మందికి పైగా దర్శించు కునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో రమాదేవి ఆదేశాల మేరకు డిప్యూటీ ఈవో ప్రతాప్ నవీన్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, బోనాల సమర్పణ ప్రాంగణాల్లో రద్దీని క్రమబద్ధీకరిం చారు. ఎస్పీఎఫ్, హోంగార్డులు, పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## జర్మనీలో ఏఎఫ్‌డీ దూకుడు..
# సంప్రదాయ పార్టీలకు షాక్!

**సాక్సోనీ–అన్‌హాల్ట్ ఎన్నికల్లో 44 శాతం ఓట్లు.. రాష్ట్రంలో అధికారానికి తొలిసారి చేరువ**



**న్యూఢిల్లీ :** జర్మనీలో రైట్‌వింగ్ పార్టీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) సాక్సోనీ–అన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయాన్ని నమోదు చేసింది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ఏఎఫ్‌డీ దాదాపు 44 శాతం ఓట్లను సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఫలితం జర్మన్ చాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం జర్మనీలోని ఓ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టేందుకు ఏఎఫ్‌డీ ఇంత చేరువ కావడం ఇదే తొలిసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఏఎఫ్‌డీ విజయంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రీవ్ స్పందిస్తూ.. ఈ ఫలితాన్ని చారిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. మరోవైపు ఫ్రాన్స్ కూడా జర్మనీ ఎన్నికల ఫలితాలను మొత్తం ఐరోపాకు కీలక పరిణామంగా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం సోషల్ మీడియా వేదికగా ఎన్నికల ఫలితాలను అంచనా వేస్తూ రూపొందించిన ఓ చిత్రాన్ని పంచుకున్నారు. అయితే ఆయన తన పోస్టులో ఏఎఫ్‌డీకి ప్రత్యక్షంగా మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. నాజీ పాలన నాటి చరిత్రను దృష్టిలో ఉంచుకుని జర్మనీలోని ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు తీవ్రవాద భావజాలంతో కూడిన మితవాద పార్టీలకు చాలా కాలంగా దూరంగా ఉంటున్నాయి. ఏఎఫ్‌డీ కూడా గతంలో పలుమార్లు మితవాద తీవ్రవాద ఆరోపణలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో సాక్సోనీ–అన్‌హాల్ట్ ఎన్నికల్లో ఆ పార్టీ సాధించిన భారీ ఆధిక్యం జర్మనీ రాజకీయాల్లోనే కాకుండా మొత్తం ఐరోపా రాజకీయ పరిణామాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.

# అమెరికాలో భారతీయులకు వినాయక చవితి అలర్ట్!

- **ఇళ్లలోనే కుటుంబంతో వేడుకలు**
- **బహిరంగ ప్రదేశాల్లో సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచనలు**




**అమెరికా:** వినాయక చవితి వేడుకలకు మరో వారం రోజులు కూడా సమయం లేని నేపథ్యంలో అమెరికాలోని భారతీయులకు స్థానిక ఇండియన్ కమ్యూనిటీ నాయకుల నుంచి కీలక సూచనలు అందుతున్నాయి. వినాయక చవితి వేడుకలను ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించాలని సూచిస్తూ ఎన్‌ఆర్‌ఐ కమ్యూనిటీలో ఓ అలర్ట్ మెసేజ్ విస్తృతంగా సర్క్యులేట్ అవుతోంది. గణేష్ చతుర్థి వేడుకలను అపార్ట్‌మెంట్లు, కాలనీలు, పబ్లిక్ ప్లేసుల్లో సామూహికంగా నిర్వహించకుండా ఇళ్లకే పరిమితం చేయాలని అందులో సూచించారు. ఎవరైనా వేడుకలకు ఆహ్వానిస్తే.. తాము ఇంట్లోనే పండుగ జరుపుకొంటామని స్పష్టం చేయాలని పేర్కొన్నారు. కంటెంట్ క్రియేటర్లకు కూడా పలు సూచనలు చేశారు. వేడుకలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, గ్రూప్ వీడియోలు, రోడ్డుపక్కన నిర్వహించే కార్యక్రమాల దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని సూచించారు. మండపాలు ఏర్పాటు చేయడం, పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడి భారీ శబ్దాలతో వేడుకలు నిర్వహించడం, రోడ్లపై కార్యక్రమాలు చేపట్టడం, నదుల్లో విగ్రహాల నిమజ్జనం చేయడం వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. శాంతియుతంగా వేడుకలు నిర్వహించడంతోపాటు స్థానిక నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అలర్ట్ మెసేజ్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించిన పలు కమ్యూనిటీ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ తరహా పోస్టులు ప్రస్తుతం అమెరికాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అమెరికాలో భారతీయులపై కొంతమేర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలోనే ఈ సూచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా కొందరు భారతీయులు నేరాలకు పాల్పడటం, సోషల్ మీడియా కంటెంట్ క్రియేషన్ పేరుతో పబ్లిక్ ప్లేసుల్లో ఇబ్బందికర పరిస్థితులు సృష్టించడం, రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహించడం వంటి ఘటనలు స్థానికంగా చర్చకు దారితీస్తున్నాయి. ఇదే సమయంలో ఉద్యోగావకాశాల విషయంలో భారతీయులపై కొంతమంది స్థానికుల్లో అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టెక్సాస్, డల్లాస్ వంటి ప్రాంతాల్లో భారతీయుల సంఖ్య, ప్రభావం పెరుగుతుండటంపై కొందరు స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఐ వర్గాలు చెబుతున్నాయి. అమెరికా ఫస్ట్ విధానానికి మద్దతు ఇచ్చే కొన్ని వర్గాల్లో భారతీయులపై వ్యతిరేక భావనలు వ్యక్తమవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో జాతి వివక్షకు సంబంధించిన ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో భారతీయులు నిర్వహించే బహిరంగ వేడుకలు స్థానికంగా మరింత అసంతృప్తికి కారణమయ్యే అవకాశం ఉందని అక్కడి ఇండియన్ కమ్యూనిటీ నాయకులు భావిస్తున్నట్లు సమాచారం. భారతీయ సమాజంపై వ్యతిరేకత మరింత పెరగకుండా చూడటంతోపాటు, ప్రతి ఒక్కరి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈసారి వినాయక చవితి వేడుకలను ఇళ్లలోనే కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా నిర్వహించాలని కమ్యూనిటీ పెద్దలు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.

## పోస్టులు తొలగించడంపై మెటాపై సీజేపీ ఆగ్రహం

**సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ప్రశ్న**

**న్యూఢిల్లీ:** తమ ఇన్‌స్టాగ్రామ్ పోస్టులను మెటా పదేపదే తొలగిస్తోందంటూ సీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోస్టులు చేసినంత మాత్రాన ఇన్‌స్టాగ్రామ్ నిబంధనలను ఉల్లంఘించినట్లేనా అంటూ మెటాను ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే తాజాగా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తాము ప్రచురిస్తున్న పోస్టులు ఇన్‌స్టాగ్రామ్ కమ్యూనిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగానే ఉన్నప్పటికీ, మెటా ఉద్దేశపూర్వకంగానే వాటిని తొలగిస్తోందని ఆయన ఆరోపించారు. సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో గతంలో చేసిన పలు పోస్టులను ఆ సంస్థ మాతృ సంస్థ అయిన మెటా తొలగించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తమ పోస్టుల్లో ఎక్కువగా ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే అంశాలే ఉంటాయని, అవి ఇన్‌స్టాగ్రామ్ నిబంధనలకు లోబడి ఉన్నాయని దీప్కే పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కూడా నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారా అని ఆయన మెటాను నిలదీశారు. ఇదే అంశంపై సీజేపీ మరో నేత సౌరవ్ దాస్ కూడా మెటాను ప్రశ్నించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా విషయంలోనూ మెటా ఇదే విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. తన ఖాతాపై మెటా ఆంక్షలు విధిస్తోందని, పోస్టులను తొలగించడంతోపాటు కొన్ని రోజులపాటు ఖాతా కార్యకలాపాలను నిలిపివేస్తోందని సౌరవ్ దాస్ పేర్కొన్నారు.

# బద్దలైన అనక్ క్రాకటోవా

- **ఆకాశాన్ని కమ్మేసిన బూడిద మేఘాలు!**
- **25 గంటల పాటు లావా, బూడిద ఉద్గారం**
- **8 విమానాశ్రయాలు మూసివేత**
- **2,300 విమానాలపై ప్రభావం**



**జకార్తా:** ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. సుమారు 25 గంటలపాటు నిరంతరాయంగా లావా, బూడిదను వెదజల్లడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిపర్వత విస్ఫోటంతో ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు కమ్ముకోవడంతో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. అనక్ క్రాకటోవా దాదాపు 24 గంటలపాటు ఏకధాటిగా లావాను వెలువరించినట్లు అధికారులు తెలిపారు. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆకాశంలో భారీగా బూడిద వ్యాపించడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జకార్తాలోని సోకార్నో–హట్టా, హలీమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో పాటు మొత్తం ఎనిమిది విమానాశ్రయాలను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. దీంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు కావడం లేదా దారి మళ్లడం జరిగింది. ఫలితంగా దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. పరిస్థితిని సమీక్షించిన ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవల్–3 హై అలర్ట్ హెచ్చరికను జారీ చేసింది. అగ్నిపర్వతం చుట్టుపక్కల ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యగా స్థానిక పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో అనక్ క్రాకటోవా నుంచి మరిన్ని విస్ఫోటనలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అయితే ప్రస్తుత విస్ఫోటనం వల్ల సునామీ ముప్పు లేదని స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైన సమయంలో సంభవించిన సునామీ తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆ ఘటనలో సుమారు 430 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం మాత్రం బూడిద, విషవాయువులు, వేడి రాళ్ల వల్ల మాత్రమే ప్రమాదం పొంచి ఉందని అధికారులు తెలిపారు. అగ్నిపర్వత పరిస్థితి వేగంగా మారుతున్న నేపథ్యంలో విమానాశ్రయాలను ఎప్పుడు తిరిగి తెరుస్తారనే దానిపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని ఇండోనేషియా రవాణాశాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నా మని, భద్రతకు ప్రాధాన్యమిస్తూ తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



# పాక్ సైన్యంలో నీళ్ల కోసం కొట్లాట

- **ట్యాంకర్ నీటి కోసం రెండు వర్గాల సైనికుల ఘర్షణ**
- **22 మందికి గాయాలు**

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో తీవ్ర నీటి కొరత సైనిక శిబిరాలనూ వెంటాడుతోంది. సైనికులకు సరిపడా తాగునీరు అందించలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, నీటి కోసం ఏకంగా సైనికులే పరస్పరం ఘర్షణకు దిగిన ఘటన కలకలం రేపుతోంది. పాకిస్తాన్‌లోని అప్పర్ సౌత్ వజిరిస్తాన్ ప్రాంతంలోని అస్మాన్ మాంజా బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. అక్కడి నీటి పంపిణీ కేంద్రం వద్ద స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ) కమాండోలు, ఫ్రంటియర్ కార్ప్స్ (ఎఫ్‌సీ) ట్రూప్స్, సాధారణ దుస్తుల్లో ఉన్న మిలిటరీ ఇంటెలిజెన్స్ సిబ్బంది మధ్య నీటి విషయంలో వివాదం తలెత్తింది. ఆయా సైనికులు విధులు నిర్వర్తించే ప్రాంతంలో కొంతకాలంగా తీవ్ర నీటి కొరత నెలకొనడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. విధుల్లో ఉన్న వివిధ విభాగాల సైనికులు ఈ ట్యాంకర్ల ద్వారానే తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ నీటి ట్యాంకర్ రావడంతో దాని నీటిని ముందుగా ఎవరు వినియోగించుకోవాలనే విషయంలో ఆయా వర్గాల మధ్య వివాదం మొదలైనట్లు తెలుస్తోంది. మాటా మాటా పెరగడంతో ఒకరిపై మరొకరు దాడులకు దిగారు. ఈ ఘర్షణలో దాదాపు 22 మంది సైనికులు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. సైనిక శిబిరంలోనే నీటి కోసం రెండు వర్గాల సైనికులు పరస్పరం దాడులకు దిగడం పాకిస్తాన్‌లో నెలకొన్న నీటి సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో పాక్ సైనిక వ్యవస్థలోని అంతర్గత పరిస్థితులు, వనరుల కొరత, నిధుల లేమి వంటి అంశాలపైనా ఈ ఘటనతో మరోసారి చర్చ మొదలైంది. సైనికులకు కనీస అవసరమైన తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం, దాని కోసం విధుల్లో ఉన్న సిబ్బంది మధ్య ఘర్షణ జరగడం పాకిస్తాన్ పరిస్థితిపై ఆందోళన కలిగిస్తోంది.

# ఈఫిల్ టవర్‌లో మహిళా ఉద్యోగుల తొలగింపు

- **ఆందోళనతో మూసివేత!**
- **హిందూ సాధువుల సందర్శన సమయంలో మహిళలను విధులకు దూరం చేశారంటూ ఉద్యోగుల ఆగ్రహం**
- **దర్యాప్తునకు పారిస్ మేయర్ ఆదేశం**



**పారిస్:** ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌లో చోటుచేసుకున్న ఓ ఘటన తీవ్ర వివాదానికి దారితీసింది. గత వారం హిందూ సంస్థ బోచసన్వాసి అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థాన్ (బీఏపీఎస్)కు చెందిన సుమారు 100 మంది హిందూ సాధువులు ఈఫిల్ టవర్‌ను సందర్శించిన సమయంలో అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందిని విధులకు దూరంగా ఉంచడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధువులకు మహిళలు కనిపించకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధి డయాన్ డావోని తెలిపారు. సాధువుల బృందం వచ్చిన సమయంలో పురుష ఉద్యోగులను విధుల్లో కొనసాగించగా, మహిళా సిబ్బందిని మాత్రం పక్కకు తప్పించినట్లు ఆమె వెల్లడించారు. ఈ ఘటనపై ఉద్యోగులు సోమవారం సమావేశమై మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని స్పష్టం చేస్తూ యాజమాన్యానికి తమ అభ్యంతరాలను తెలియజేశారు. ఉద్యోగుల ఆగ్రహం నేపథ్యంలో సోమవారం ఈఫిల్ టవర్‌ను మూసివేశారు. జరిగిన ఘటనపై మేనేజ్‌మెంట్ సిబ్బందికి క్షమాపణలు చెప్పింది. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టనున్నట్లు పారిస్ మేయర్ ఎమ్మాన్యువల్ గ్రెగొరీ తెలిపారు. ఉద్యోగుల ఆగ్రహాన్ని తాము అర్థం చేసుకున్నామని, వారి మనస్తాపం వాస్తవమేనని ఆయన పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల పారిస్ శివారు ప్రాంతంలో ఓ హిందూ ఆలయాన్ని ప్రారంభించారు. ఆ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు బీఏపీఎస్‌కు చెందిన సాధువులు పెద్ద సంఖ్యలో పారిస్‌కు వచ్చినట్లు సమాచారం. సాధువుల బృందం భారీ సంఖ్యలో ఉండటంతో ఇతర సందర్శకులకు ఇబ్బంది కలగకుండా ఈఫిల్ టవర్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మేనేజ్‌మెంట్ వెల్లడించింది. సాధువుల రాక సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తన ప్రకటనలో పేర్కొంది. అయితే మహిళా ఉద్యోగులను విధుల నుంచి తప్పించడంపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఫ్రాన్స్ రాజకీయ వర్గాల్లోనూ స్పందనలు వెలువడ్డాయి. అతిథులను ఆహ్వానించడం అంటే దేశ విలువలను వదులుకోవడం కాదని, ఫ్రాన్స్‌లో మహిళలు ప్రజాజీవితంలో సంపూర్ణ భాగస్వాములుగా ఉంటారని నేషనల్ అసెంబ్లీ అధ్యక్షురాలు యేల్ బ్రాన్ పివెట్ వ్యాఖ్యానించారు. ఒకరి కోసం మహిళలను ప్రజాజీవితం నుంచి అదృశ్యం కావాలని చెప్పే పరిస్థితి ఫ్రాన్స్‌లో ఉండదని ఆమె స్పష్టం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## వ్యాన్ డైక్‌పై ఉగ్రవాద అభియోగాలు తొలగింపు

- **మరో ఆరుగురు ఉక్రెయిన్ పౌరులపై యూఏపీఏ కేసులూ రద్దు**

**న్యూఢిల్లీ:** దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో అరెస్టు చేసిన అమెరికా పౌరుడు మాథ్యూ వ్యాన్ డైక్ విషయంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాన్ డైక్‌తో పాటు మరో ఆరుగురు ఉక్రెయిన్ పౌరులపై గతంలో నమోదు చేసిన ఉగ్రవాద అభియోగాలను ఎన్ఐఏ తాజాగా తొలగించింది. గతంలో యూఏపీఏ చట్టంలోని నిబంధనల కింద నమోదు చేసిన కేసులను రద్దు చేసి, ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్‌లోని సెక్షన్ 21, సెక్షన్ 23 కింద కొత్తగా కేసులు నమోదు చేసింది. దేశంలోకి విదేశీయుల ప్రవేశం, వారి ప్రవర్తన, కార్యకలాపాలు, నిబంధనలకు అనుగుణంగా వ్యవ హరించడం వంటి అంశాలకు సంబంధించిన నిబం ధనలే వీటిలో ఉన్నాయి. దేశంలో ఉగ్ర కుట్రలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో నిందితులను ఎన్ఐఏ అధికారులు గత మార్చిలో వివిధ విమానా శ్రయాల్లో అరెస్టు చేశారు. ఉగ్రవాదుల ప్రాబల్యం ఉన్న మయన్మార్‌లో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతోపాటు, ఉగ్రవాద శిక్షణ ఇస్తున్నారనే ఆరోపణలు వారిపై అప్పట్లో వచ్చాయి. ఈ నేపథ్యంలో నిందితులపై యూఏపీఏ కింద కేసులు నమోదు చేశారు. అయితే తాజాగా ఆ చట్టంలోని అభియోగాలను తొలగించి, విదేశీయుల ప్రవేశం, ప్రవర్తన, కార్యకలాపాలకు సంబంధించిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లపై అలర్ట్

- **ఇన్‌స్టామార్ట్, అమెజాన్ స్టోర్లలో భారీగా గడువు ముగిసిన ఆహార పదార్థాలు**
- **రూ.1.38 కోట్ల విలువైన సరుకు సీజ్**

**బెంగళూరు:** ఆన్‌లైన్‌లో ఆఫర్లు కనిపించగానే ఫుడ్ ప్రొడక్ట్స్ ఆర్డర్ చేసే వినియోగదారులు ఇకపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ స్టోర్లలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలను పరిశీలించకుండానే కొనుగోలు చేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని బెంగళూరులో జరిగిన అధికారుల తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పలు ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా గడువు ముగిసిన, నాణ్యత కోల్పోయిన ఆహార పదార్థాలు బయటపడ్డాయి. అనేకల్, హోస్కోటెతో పాటు ఇతర ప్రాంతాల్లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, అమెజాన్ స్టోర్లపై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా ఫుడ్ స్టోర్లలో గడువు ముగిసిన ఉత్పత్తులతోపాటు తప్పుడు లేబుల్స్ కలిగిన పలు రకాల ఆహార పదార్థాలను గుర్తించారు. అంతేకాకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి పాటించాల్సిన భద్రతా ప్రమాణాలను కూడా కొన్ని స్టోర్లు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో పాడైపోయిన, కుళ్లిన ఆహార పదార్థాలను సీజ్ చేయడంతోపాటు సంబంధిత స్టోర్లను మూసివేశారు. అమెజాన్, ఇన్‌స్టామార్ట్ స్టోర్లలో కలిపి మొత్తం రూ.1.38 కోట్ల విలువైన ఫుడ్ ప్రొడక్ట్స్‌ను అధికారులు సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీజ్ చేసిన వాటిలో జీడిపప్పు, రాగి పిండి, చికెన్ ప్యాటీ, పనీర్, కుకీస్, నట్స్, గుడ్లు, వివిధ రకాల పిండితోపాటు ఇతర ప్యాకేజ్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఉన్నాయి. ఇదే ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కొన్ని ఆన్‌లైన్ మెడికల్ స్టోర్లపైనా అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడ సుమారు రూ.2.45 లక్షల విలువైన గడువు ముగిసిన మందులను గుర్తించారు. వాటిని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన 'పెప్టైడ్ పార్టీ' వ్యవహారంపై విచారణ కొనసాగుతున్న సమయంలో బయటపడిన కొన్ని డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించడంతో వివిధ ఆన్‌లైన్ స్టోర్లలో జరుగుతున్న వ్యవహారాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీంతో అధికారులు ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నాణ్యత లేని, గడువు ముగిసిన ఆహార పదార్థాలు బయటపడటంతో ఆన్‌లైన్ ఫుడ్ కొనుగోళ్లపై వినియోగదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు.

# అసెంబ్లీలో సంజ్ఞలపై విజయ్ వివరణ

- **స్టాలిన్‌ను బాడీ షేమింగ్ చేయలేదు**
- **ఉద్దేశపూర్వకంగా ఎవరినీ అవమానించలేదు: సీఎం విజయ్**



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీలో తన శరీర భాష, సంజ్ఞలపై చెలరేగిన వివాదానికి ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్ వివరణ ఇచ్చారు. తాను ఉద్దేశపూర్వకంగా ఎవరినీ అవమానించేలా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నట్లుగా డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను బాడీ షేమింగ్ చేయలేదని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీలో మాట్లాడుతున్న సమయంలో అనుకోకుండా తన చేయి దవడవైపు వెళ్లిందని, అంతేతప్ప దాని వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు. సెప్టెంబర్ 7న శాసనసభలో పోలీసు శాఖ గ్రాంట్లపై మాట్లాడుతున్న సమయంలో తన శరీర భాష అనుకోకుండా అలా వచ్చిందని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు. "నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. సెప్టెంబర్ 7న అసెంబ్లీలో పోలీసు శాఖ గ్రాంట్ల అంశంపై మాట్లాడుతున్న సమయంలో నా శరీర భాష అనుకోకుండా అలా వచ్చింది. ఒకరిని బాధపెట్టాలనే ఉద్దేశంతో నేను అలా చేయలేదు. కాబట్టి నేను ఎవరినీ ఉద్దేశించి గానీ, ఎవరినైనా అవమానించాలనే ఉద్దేశంతో గానీ అలా చేయలేదని స్పష్టం చేస్తున్నాను. నా తీరును ఎవరికీ ఆపాదించవద్దని కోరుతున్నాను" ఈ వ్యవహారంపై సీపీఐ(ఎం) నాయకుడు పీ. షణ్ముగం స్పందిస్తూ.. సీఎం విజయ్ ఉద్దేశపూర్వకంగానే మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో అంతర్గత భద్రత చట్టం అమలులో ఉన్నప్పుడు స్టాలిన్‌ను పోలీసులు అరెస్టు చేశారని, ఆ సమయంలో ఆయన దవడకు తీవ్ర గాయమైందని షణ్ముగం పేర్కొన్నారు. అలాంటి చారిత్రక ఘటనను గుర్తుచేసేలా స్టాలిన్ రూపాన్ని ఎగతాళి చేసే విధంగా సీఎం సంజ్ఞలు చేయడం ఆక్షేపణీయమని ఆయన అన్నారు. అయితే తాను ఎవరినీ ఉద్దేశపూర్వకంగా అవమానించలేదని సీఎం విజయ్ ఇచ్చిన వివరణతో ఈ వివాదానికి తెరపడుతుందా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కేకే కమిటీ సభ్యులను కలవనున్న భివండీ మహిళా ఉద్యమకారులు

- **తెలంగాణ ఉద్యమంలో భివండీ నుంచి చేసిన పోరాటాన్ని కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్ పర్యటనకు సన్నాహాలు**



**ప్రజానావ, ముంబై:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా భాగస్వాములైన భివండీ మహిళా ఉద్యమకారులు త్వరలో హైదరాబాద్‌లో కేకే కమిటీ సభ్యులను కలవనున్నారు. భివండీ తెలుగు సంఘం, ఎంటిజెఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భివండీలోని పద్మనగర్‌లో తెలంగాణ పోరాట మహిళా ఉద్యమకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా జనజాగృతి అధ్యక్షురాలు బొద్దుల రమాదేవి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం భివండీలో బతుకమ్మ ఉత్సవాలతోపాటు జనజాగరణ కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఎంటిజెఏసీ కో–కన్వీనర్ సిరిపురం తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయం లో భివండీ నుంచి పలుమార్లు హైదరాబాద్ వెళ్లి అప్పటి నాయకులు కేటీఆర్, మేధావులు అల్లం నారాయణ, దేవీప్రసాద్, మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రొఫె సర్ కోదండరాం తదితరులను కలిసి భివండీలోని బట్టల మిల్లుల్లో పనిచేస్తున్న వలసజీవుల సమస్యలు, వారి జీవన గాథలను వివరించిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో చేసిన ఉద్యమ కార్యక్రమా లు, తెలంగాణ సాధన కోసం భివండీ నుంచి అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. మరో సీనియర్ నాయకుడు బోగ సుదర్శన్ పద్మశాలి, 'కోమల్ సమాచార్' ఎడిటర్ శ్రీనివాస్ సిరిమల్లె మాట్లాడుతూ తమ పత్రికను సైతం తెలంగాణ ఉద్యమానికి అంకితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రవాస తెలంగాణవాదులు పోషించిన పాత్రను కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలో సూరత్, ముంబై, భివండీ ప్రతినిధులతో కలిసి హైదరాబాద్ వెళ్లి కేకే కమిటీ సభ్యులను కలవడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగం దేవిక, శంకర మ్మ, అశ్వినీ, గీతాంజలి, కె.సరోజ, ఉప్పలమ్మ, కళావ తి, జర్నలిస్ట్ కరి బాబురావుతో పాటు ముంబై నుంచి మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు.

# వన్డే భవితవ్యంపై పాంటింగ్ ఆందోళన

- టీ20 లీగ్‌ల విస్తరణతో 50 ఓవర్ల క్రికెట్‌కు తగ్గనున్న ప్రాధాన్యం
- టెస్టులకు 'బిగ్ ఫోర్' దేశాల అండ




**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఫ్రాంచైజీ లీగ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో వన్డే క్రికెట్ భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ క్రికెట్ దిగ్గజం రికీ పాంటింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో 50 ఓవర్ల క్రికెట్ 'తక్కువగా ఆడటం అనివార్యం' కావచ్చని ఆయన అన్నారు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా వంటి ప్రధాన దేశాలు టెస్టు క్రికెట్‌కు మద్దతుగా ఉన్నంతకాలం ఆ ఫార్మాట్ బలంగా కొనసాగుతుందని పాంటింగ్ పేర్కొన్నారు. 'ఏదో ఒక ఫార్మాట్ తగ్గాల్సిందే. అందుకు స్పష్టమైన అవకాశం వన్డేలకే ఉంది' అని తెలిపారు.

### టీ20లతో అవకాశాలు.. సవాళ్లు

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న టీ20 లీగ్‌లు ఆటగాళ్లకు మంచి ఆదాయ, కెరీర్ అవకాశాలు కల్పిస్తున్నాయని పాంటింగ్ చెప్పారు. ముఖ్యంగా కెరీర్ చివరి దశలో ఉన్న ఆటగాళ్లకు లెజెండ్స్ టోర్నీలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అయితే అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్ మధ్య సమతుల్యత సాధించడం, ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించడం సవాలుగా మారుతుందన్నారు. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో క్రికెట్ కూడా ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ తరహాలో మారే అవకాశం ఉందన్నారు. అయితే వివిధ ఫ్రాంచైజీ లీగ్‌లలో స్థానిక, విదేశీ ఆటగాళ్ల నిష్పత్తిపై నిబంధనలు మార్చాల్సి ఉంటుందని చెప్పారు. టీ20ల విస్తరణతో అసోసియేట్ దేశాల ఆటగాళ్లకు అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో ఆస్ట్రేలియా ఛాంపియన్స్ జట్టుకు పాంటింగ్ సహ యజమానిగా చేరనున్నారు. ఈ ఏడాది టోర్నీ యూఏఈకి మారడంతోపాటు ఏడో జట్టు చేరింది. డేవిడ్ వార్నర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

# షమీ దెబ్బకు దక్షిణ్ జోన్ విలవిల

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో తూర్పు జోన్‌కు భారీ ఆధిక్యం
- 708 పరుగుల తొలి ఇన్నింగ్స్.. 242/6కు దక్షిణ్ జోన్
- 17 పరుగులకు 2 వికెట్లతో చెలరేగిన మహ్మద్ షమీ



**చెన్నై:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో తూర్పు జోన్ టైటిల్‌కు చేరువైంది. అనుభవజ్ఞుడైన పేసర్ మహ్మద్ షమీ కీలక సమయాల్లో కట్టుదిట్టమైన స్పెల్స్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టడంతో.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణ్ జోన్ 6 వికెట్లకు 242 పరుగులు చేసింది. తూర్పు జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు సాధించడంతో దక్షిణ్ జోన్ ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. తేమతో కూడిన చెన్నై పరిస్థితులను సద్వినియోగం చేసుకున్న షమీ మూడు స్పెల్స్‌లో 11 ఓవర్లు బౌలింగ్ చేసి 17 పరుగులకే రెండు వికెట్లు పడగొట్టాడు. స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. షైక్ రషీద్ (29), రవిచంద్రన్ స్మరణ్ వికెట్లు షమీ ఖాతాలో చేరాయి.

### భాగస్వామ్యాలకు బ్రేక్‌లు

దక్షిణ్ జోన్ ఇన్నింగ్స్‌ను రికీ భుయ్ వికెట్‌తో ముఖేశ్ కుమార్ ప్రారంభించాడు. అనంతరం నారాయణ జగదీశన్ (32), దేవదత్ ప్యాడికల్ రెండో వికెట్‌కు 60 పరుగులు జోడించారు. అయితే పార్ట్‌టైమ్ స్పిన్నర్ శిఖర్ మోహన్ బౌలింగ్‌లో జగదీశన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత ప్యాడికల్ (62), షైక్ రషీద్ మూడో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. ఈ భాగస్వామ్యానికీ షమీ ముగింపు పలికాడు. అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపాడు. అనంతరం తిలక్ వర్మతో కలిసి 45 పరుగులు జోడించిన స్మరణ్‌ను కూడా షమీ ఔట్ చేశాడు. 65 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన కొద్దిసేపటికే ప్యాడికల్ కూడా ముఖేశ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. తనకు ఇష్టమైన పికప్ ఫ్లిక్ ఆడే ప్రయత్నంలో డీప్‌లో డీపీ దాస్‌కు క్యాచ్ ఇచ్చాడు.

### తిలక్ ఒంటరి పోరాటం

దక్షిణ్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ 133 బంతుల్లో 56 పరుగులతో అజేయంగా నిలిచాడు. శ్రేయస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. అయితే రోజు ముగిసే సమయంలో శ్రేయస్‌ను ఔట్ చేయడంతో దక్షిణ్ జోన్ మరింత ఒత్తిడిలోకి వెళ్లింది. తిలక్‌కు సీవీ మిలింద్ (0) జతగా ఉన్నాడు. తూర్పు జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కారణంగా దక్షిణ్ జోన్ ఫాలోఆన్ ముప్పు నుంచి బయటపడాలంటే ఇంకా భారీగా పరుగులు చేయాల్సి ఉంది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉండటంతో తూర్పు జోన్ టైటిల్‌పై పట్టు బిగించింది.

# ఆసియా క్రీడలకు అత్యుత్తమ జట్టు

- నాగోయాలోనే ఆటగాళ్లకు వసతి
- ఫైవ్‌స్టార్ కాకపోయినా సౌకర్యవంతమైన ఏర్పాట్లు
- ఈ నెల 20న జపాన్‌కు భారత జట్టు పయనం

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడలకు భారత్ 'బీ' జట్టును పంపుతోందన్న ప్రచారాన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఖండించారు. అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లతో కూడిన జట్టే ఆసియా క్రీడల్లో బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. భారత జట్టు తప్పకుండా రాణిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రికెటర్లు నిర్వాహకులు కేటాయించిన అధికారిక వసతి గృహాల్లోనే బస చేయనున్నారని ఆయన వెల్లడించారు. అవి ఫైవ్‌స్టార్ హోటళ్లు కాకపోయినా ఆటగాళ్లకు అవసరమైన సౌకర్యాలు ఉంటాయని, ప్రతి క్రికెటర్‌కు ప్రత్యేక గది కేటాయిస్తారని తెలిపారు. ఆసియా క్రీడలు జరిగే నాగోయాలో అత్యున్నత స్థాయి హోటళ్ల కొరత ఉండడంతో వసతి అంశంపై చర్చ జరిగిందని శుక్లా చెప్పారు. ఆటగాళ్లను టోక్యో లేదా ఒసాకాలో ఉంచితే ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, అందుకే నాగోయాలోనే వసతి కల్పించాలని నిర్ణయించినట్లు వివరించారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), ఆసియా క్రీడల నిర్వాహక కమిటీ, జపాన్ క్రికెట్ సంఘం సమన్వయంతో వసతి ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు.

### మైదానం, పిచ్‌పైనే దృష్టి

వసతి ఏర్పాట్లపై బీసీసీఐ, ఆటగాళ్లు సంతృప్తిగా ఉన్నారని శుక్లా పేర్కొన్నారు. అయితే మైదానం, పిచ్, డ్రెస్సింగ్ రూమ్‌లే తమ ప్రధాన ఆందోళనగా ఉన్నాయని చెప్పారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) బృందం ఆయా సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. భారత జట్టు సెప్టెంబర్ 20న జపాన్‌కు బయలుదేరనుంది. సెప్టెంబర్ 22న జపాన్‌తో చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 28న ఆసియా క్రీడల్లో భారత్ తన తొలి మ్యాచ్ ఆడుతుంది. గత ఆసియా క్రీడల్లో పురుషుల, మహిళల క్రికెట్ విభాగాల్లో భారత్ స్వర్ణ పతకాలు సాధించింది.

# టీమిండియాతో మూడు దిగ్గజ బ్రాండ్ల జోడీ

- క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీకి బీసీసీఐ అసోసియేట్ పార్ట్‌నర్ హోదా
- రెండు సీజన్లకు రూ.130 కోట్లకు పైగా భాగస్వామ్యాల విలువ

**న్యూఢిల్లీ:** భారత గడ్డపై జరిగే అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీని అసోసియేట్ పార్ట్‌నర్లుగా బీసీసీఐ ప్రకటించింది. ఈ మూడు సంస్థలతో కుదిరిన భాగస్వామ్యాల విలువ రెండు సీజన్లకు కలిపి రూ.130 కోట్లకు పైగా ఉందని బోర్డు వెల్లడించింది. గతంతో పోలిస్తే ఈసారి విలువ 44 శాతం పెరిగినట్లు తెలిపింది. భారత్–వెస్టిండీస్ మధ్య జరగనున్న స్వదేశీ సిరీస్ నుంచే ఈ భాగస్వామ్యాలు అమల్లోకి రానున్నాయి. 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే బీసీసీఐ అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఇవి వర్తిస్తాయి. పానీయాలు, బీమా, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక రంగాలకు చెందిన మూడు ప్రముఖ బ్రాండ్లు భారత క్రికెట్‌తో భాగస్వామ్యం కావడం ద్వారా బీసీసీఐ తన వాణిజ్య భాగస్వామ్యాల పరిధిని మరింత విస్తరించింది.

### భారత క్రికెట్ బలానికి నిదర్శనం

క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీ భాగస్వాములుగా చేరడం భారత క్రికెట్ వ్యవస్థపై ప్రముఖ బ్రాండ్లకు ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ అన్నారు. భాగస్వామ్యాల విలువ గణనీయంగా పెరగడం మరింత ప్రోత్సాహకరమని పేర్కొన్నారు. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. స్వదేశీ అంతర్జాతీయ సీజన్ భాగస్వామ్యాల విలువ పెరగడం బీసీసీఐతోపాటు టీమ్ఇండియాపై బ్రాండ్లకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. ప్రముఖ సంస్థలు భారత క్రికెట్‌తో అనుబంధం కొనసాగించేందుకు ఆసక్తి చూపడం బోర్డు వాణిజ్య సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు.

# టాప్-5లో స్మృతి

- ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో సత్తాచాటిన టీమిండియా మహిళా క్రికెటర్లు
- బౌలర్ల జాబితాలో ఆరో స్థానానికి చేరిన దీప్తి శర్మ



**దుబాయ్:** భారత మహిళల జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధానా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్–5లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై 64 బంతుల్లోనే 124 పరుగులతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన మంధానా.. భారత్ 137 పరుగుల భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ ప్రదర్శనతో తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానాన్ని కొనసాగించింది. హాంకాంగ్‌పై శతకంతో మంధానా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచింది. మొత్తం 10,880 పరుగులకు చేరుకున్న ఆమె.. ఇప్పటివరకు ఈ రికార్డు పేరిట ఉన్న మిథాలీ రాజ్ (10,868)ను అధిగమించింది. అంతేకాక అంతర్జాతీయ క్రికెట్‌లో 18వ శతకాన్ని నమోదు చేసిన మంధానా.. మహిళల క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్ల జాబితాలో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.

### దీప్తికి రెండు స్థానాల పురోగతి

భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా టీ20 ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమర్థంగా రాణించిన ఆమె.. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకుంది. టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో మాత్రం ఐదో స్థానాన్ని కొనసాగిస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కెప్టెన్ ఈషా ఓజా కూడా టీ20 ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది. తాజా బ్యాటర్ల జాబితాలో 39వ స్థానానికి చేరుకున్న ఆమె.. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లోనూ టాప్–20కు చేరువగా నిలిచింది. అసోసియేట్ దేశాల నుంచి అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లలో ఒకరిగా ఈషా ఎదుగుతోంది.

# మళ్లీ నీలి జెర్సీ

- కాషాయ జెర్సీపై వివాదం నేపథ్యంలో హాకీ ఇండియా నిర్ణయం



**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు సంప్రదాయ నీలి రంగు జెర్సీలతో బరిలోకి దిగనున్నాయి. ఇటీవల నీలి రంగు స్థానంలో కాషాయ రంగు జెర్సీని ప్రవేశపెట్టడంపై తీవ్ర విమర్శలు, వివాదాలు చెలరేగిన నేపథ్యంలో హాకీ ఇండియా (హెచ్ఐ) ఈ నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్, బెల్జియంలో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌లో భారత జట్లు కాషాయ రంగు జెర్సీలతోనే మ్యాచ్‌లు ఆడాయి. దీనిపై అప్పట్లో హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకు, ఫెడరేషన్ ఎన్నికైన నాయకత్వానికి, ఎగ్జిక్యూటివ్ బోర్డుకు సమాచారం ఇవ్వకుండానే జెర్సీ రంగును మార్చడంపై ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారం రాజకీయంగానూ వివాదానికి దారితీసింది.

### నీలమే తొలి ఎంపిక

ఆసియా క్రీడల జట్టు కిట్ రంగుపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తమ అభిప్రాయాన్ని కోరిందని తిర్కీ తెలిపారు. హాకీ ఇండియా నీలం రంగును తొలి ఎంపికగా, ఆరెంజ్‌ను రెండో ఎంపికగా సూచించిందన్నారు. కాషాయ జెర్సీ శాశ్వతం కాదని ప్రపంచకప్‌కు ముందే స్పష్టం చేశామని, ఆసియా క్రీడల్లో భారత జట్లు నీలి జెర్సీలతోనే ఆడతాయని పేర్కొన్నారు. నీలం రంగు టర్ఫ్‌పై అదే రంగు జెర్సీలు స్పష్టంగా కనిపించవన్న కారణంతో గతంలో కిట్ రంగును మార్చారు. అయితే మాజీ కెప్టెన్లు వీరెన్ రస్కిన్హా, పర్గత్ సింగ్, ధన్‌రాజ్ పిళ్లై, అజిత్ పాల్ సింగ్ తదితర హాకీ దిగ్గజాలు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా ప్రశ్నించారు.

### ఒలింపిక్స్ బెర్తే లక్ష్యం

ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు ఎనిమిదో స్థానంలో నిలిచింది. మహిళల జట్టు ఐదో స్థానంలో నిలిచి 1974 తర్వాత ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఆసియా క్రీడలు భారత హాకీ జట్లకు కీలకంగా మారాయి. టోర్నీలో మెరుగైన ప్రదర్శనతో 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంతోపాటు, ఆసియా ఖండంలో తమ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత జట్లు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## Business
## బిజినెస్

# ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలకు జోష్

- ఆగస్టులో 53 శాతం వృద్ధి
- 2.98 లక్షల ఈవీల విక్రయాలు.. మార్కెట్ వాటా 12.3 శాతానికి
- టూవీలర్ అమ్మకాల్లో 67 శాతం వృద్ధి.. కమర్షియల్ ఈవీల్లో 188 శాతం పెరుగుదల



**ముంబయి:** దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలు వేగంగా పెరుగుతున్నాయి. ఆగస్టులో దేశవ్యాప్తంగా 2.98 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఇది 52.9 శాతం వృద్ధి. దీంతో మొత్తం ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఈ వివరాలను ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) వెల్లడించింది. టూవీలర్లలో భారీ వృద్ధి: ఎలక్ట్రిక్ టూవీలర్ విభాగంలో ఆగస్టులో 1,83,204 వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 1,09,673 యూనిట్లతో పోలిస్తే 67.05 శాతం వృద్ధి నమోదైంది. అయితే జులైతో పోల్చినప్పుడు విక్రయాలు 10.37 శాతం తగ్గాయి.
ప్యాసింజర్ వాహనాలూ పెరిగాయి: ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు ఆగస్టులో 30,696 యూనిట్లకు చేరాయి. గతేడాదితో పోలిస్తే 51.89 శాతం వృద్ధి నమోదైంది. అయితే జులై నెలతో పోల్చితే 6.78 శాతం తగ్గుదల కనిపించింది.
త్రీ వీలర్లకు డిమాండ్: ఎలక్ట్రిక్ త్రీ వీలర్ విభాగంలో 79,846 వాహనాలు విక్రయమయ్యాయి. గతేడాదితో పోలిస్తే 25.28 శాతం వృద్ధి నమోదైంది. జులైతో పోలిస్తే మాత్రం విక్రయాలు 8.28 శాతం తగ్గాయి.
కమర్షియల్ ఈవీల్లో భారీ వృద్ధి: ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఆగస్టులో 4,702 యూనిట్లు విక్రయమయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి నమోదైంది. జులైతో పోలిస్తే 32.23 శాతం పెరుగుదల సాధించాయి.

# స్టాక్ మార్కెట్లకు భారీ షాక్

- 555 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- అంతర్జాతీయ అనిశ్చితితో అమ్మకాల ఒత్తిడి
- క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో ఆందోళన
- అమెరికా వడ్డీ రేట్లపై మదుపరుల్లో భయాలు
- ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో భారీ అమ్మకాలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల, అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై నెలకొన్న ఆందోళనలు మదుపరుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు కీలకమైన ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి.
మంగళవారం ఉదయం సెన్సెక్స్ 75,970.28 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. సోమవారం 76,132.81 పాయింట్ల వద్ద ముగిసిన సూచీ.. రోజంతా ప్రతికూలంగానే కదలాడింది. ఇంట్రాడేలో ఒక దశలో 75,553.35 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయింది. చివరికి 555.23 పాయింట్లు కోల్పోయి 75,577.58 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ కూడా నష్టాల్లోనే కొనసాగింది. 144.05 పాయింట్లు దిగజారి 23,635.10 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.81గా నమోదైంది.

### ఈ షేర్లపై ప్రభావం

సెన్సెక్స్–30లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు బీఈఎల్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యునిలీవర్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

### మళ్లీ పరుగులు పెట్టిన బంగారం, వెండి

అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు కూడా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 98.39 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు బంగారం ఔన్స్ ధర 4,400.62 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దేశీయ మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు మళ్లీ పైపైకి కదులుతున్నాయి. పసిడి ధర రూ.1.60 లక్షల మార్క్‌కు చేరువవుతోంది.

# కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి భారీ స్పందన

- రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి 7 దరఖాస్తులు
- అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌టీపీసీ, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ సహా పలు సంస్థల ఆసక్తి



**న్యూఢిల్లీ:** దేశీయ బొగ్గు నిల్వలను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి మంచి స్పందన లభించింది. రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకం కింద మొత్తం ఏడు దరఖాస్తులు వచ్చినట్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌టీపీసీ, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ తదితర సంస్థలు ఈ పథకం కింద ప్రతిపాదనలు సమర్పించాయి. యూరియా తయారీకి అదానీ ప్రతిపాదనలు యూరియా తయారీ కోసం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు ప్రతిపాదనలు సమర్పించినట్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. మొత్తం ఏడు దరఖాస్తుల్లో యూరియా ప్రాజెక్టుకు అదానీ గ్రూప్ నుంచి ప్రతిపాదన వచ్చినట్లు పేర్కొంది. సింథటిక్ నేచురల్ గ్యాస్ తయారీ కోసం ఎన్‌టీపీసీ, సింథసిస్ గ్యాస్ ఉత్పత్తి కోసం శ్యామ్ సెల్ అండ్ పవర్ వంటి సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ పథకం కింద తొలి దశ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 7తో ముగిసింది. సెప్టెంబర్ 8 నుంచి రెండో దశ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు కేంద్రం వెల్లడించింది. దిగుమతులపై ఆధారపడ టాన్ని తగ్గించే లక్ష్యం దేశంలో సమృద్ధిగా ఉన్న బొగ్గు నిల్వలను గ్యాసిఫికేషన్ ద్వారా విలువైన ఉత్పత్తులుగా మార్చడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇంధనం, ఎరువులు, సింథటిక్ గ్యాస్ వంటి అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు దేశీయ వనరుల వినియోగాన్ని పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# వైట్ కాలర్ నియామకాల్లో హైదరాబాద్ దూకుడు

- దేశవ్యాప్తంగా ఆగస్టులో 14 శాతం వృద్ధి
- 23 శాతం పెరిగిన హైదరాబాద్ నియామకాలు.. ఆటో రంగంలో అత్యధికంగా 19 శాతం

**హైదరాబాద్:** దేశంలో వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు గణనీయంగా పుంజుకున్నాయి. వార్షిక ప్రాతిపదికన ఆగస్టులో నియామకాలు 14 శాతం పెరిగినట్లు నౌకరీ.కామ్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది ఆగస్టులో 2,664గా ఉన్న జాబ్‌స్పీక్ సూచీ.. ఈ ఏడాది అదే నెలలో 3,028కు చేరింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉద్యోగ నియామకాలు వేగం పుంజుకున్నట్లు నివేదిక పేర్కొంది. నౌకరీ.కామ్ తన ప్లాట్‌ఫాంపై నమోదైన కొత్త ఉద్యోగాలు, ఉద్యోగుల సెర్చ్ కార్యకలాపాల ఆధారంగా నెలవారీగా జాబ్‌స్పీక్ నివేదికను రూపొందిస్తుంది. ఆగస్టులో ఆటోమొబైల్ రంగంలో వైట్ కాలర్ నియామకాలు అత్యధికంగా 19 శాతం పెరిగాయి. హెల్త్‌కేర్ రంగంలో 16 శాతం, రిటెయిల్‌లో 15 శాతం, ఇన్సూరెన్స్‌లో 12 శాతం, ఐటీ రంగంలో 11 శాతం వృద్ధి నమోదైంది.
ఐటీ రంగం తిరిగి పుంజుకోవడంతో పాటు నాన్–ఐటీ రంగాలు వేగంగా విస్తరిస్తుండటం నియామకాలు పెరగడానికి ప్రధాన కారణమని నివేదిక తెలిపింది. ముఖ్యంగా ఆటో, హెల్త్‌కేర్, రిటెయిల్, ఇన్సూరెన్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ప్రధాన నగరాల విషయానికొస్తే హైదరాబాద్ అత్యధికంగా 23 శాతం వృద్ధితో ముందంజలో నిలిచింది. ఆ తర్వాత కోల్‌కతా, చెన్నై, బెంగళూరు నగరాలు ఉన్నాయి. ఐటీతో పాటు వివిధ నాన్–ఐటీ రంగాల్లో అవకాశాలు పెరగడం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామకాలు జోరందుకోవడానికి దోహదపడినట్లు నివేదిక వెల్లడించింది.

# ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ రూ.1.60 లక్షలు?

- సెప్టెంబర్ 9న యాపిల్ ఈవెంట్.. కొత్త ప్రో మోడళ్లపై భారీ అంచనాలు
- తొలిసారి ఫోల్డబుల్ ఐఫోన్.. పేరు 'ఐఫోన్ డ్యుయో' అంటూ ప్రచారం

**ముంబయి:** టెక్ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాపిల్ ఈవెంట్ సమీపిస్తోంది. సెప్టెంబర్ 9న జరగనున్న ఈ కార్యక్రమంలో సంస్థ కొత్త ఐఫోన్ మోడళ్లను పరిచయం చేయనున్నట్లు టెక్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యాపిల్ నుంచి అధికారిక ప్రకటన వెలువడకపోయినప్పటికీ.. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌తో పాటు సంస్థ తొలిసారి ఫోల్డబుల్ ఐఫోన్‌ను ఆవిష్కరించవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఫోన్ల ధరలపై కూడా అంచనాలు మొదలయ్యాయి.

### రూ.2 లక్షలు దాటనున్న టాప్ వేరియంట్?

భారత మార్కెట్‌లో ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ప్రారంభ ధర రూ.1.55 లక్షల నుంచి రూ.1.60 లక్షల మధ్య ఉండొచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అధిక స్టోరేజ్ సామర్థ్యం కలిగిన టాప్ వేరియంట్ల ధరలు రూ.2 లక్షల మార్కును దాటే అవకాశం ఉందని తెలుస్తోంది.గతేడాది ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 256GB వేరియంట్‌ను రూ.1.49 లక్షల ప్రారంభ ధరతో యాపిల్ తీసుకొచ్చింది. 512GB మోడల్ ధర రూ.1.69 లక్షలు, 1TB వేరియంట్ రూ.1.89 లక్షలు, 2TB మోడల్ రూ.2.29 లక్షలుగా నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 18 సిరీస్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

### ఖరీదైన విడిభాగాలు.. కొత్త చిప్?

ఈ ఏడాది మెమొరీ చిప్‌లు, ఇతర విడిభాగాల ధరలు పెరగడం కూడా కొత్త ఐఫోన్ల ధరలపై ప్రభావం చూపవచ్చని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ఐఫోన్ 18 సిరీస్‌లో టీఎస్ఎంసీకి చెందిన కొత్త 2nm చిప్ టెక్నాలజీని ఉపయోగించవచ్చని, కెమెరా విభాగంలోనూ పలు మార్పులు చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ కారణాలతో ఐఫోన్ 17 సిరీస్‌తో పోలిస్తే కొత్త మోడళ్ల ధరలు సుమారు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా.

### ఫోల్డబుల్ ఐఫోన్ పేరు ఇదేనా?

యాపిల్ తొలిసారి తీసుకురానున్న ఫోల్డబుల్ ఐఫోన్ ఈ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది. ఈ ఫోన్ పేరుపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో దీనిని 'ఐఫోన్ అల్ట్రా'గా పిలిచే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. తాజాగా 'ఐఫోన్ డ్యుయో' అనే పేరు తెరపైకి వచ్చింది. అయితే ఈ పేరుపై యాపిల్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

# జాతీయ చలనచిత్ర పురస్కారాలకు కొత్త వేదిక!




జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో ఈసారి సరికొత్త అధ్యాయం ఆవిష్కృతం కానుంది. ఏకంగా 72 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయానికి తెరదించుతూ.. తొలిసారిగా అవార్డుల వేడుకను ఢిల్లీ వెలుపల నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయించింది. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ వేదికగా 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను అందజేయనున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' కొలువై ఉన్న ఏక్తా నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. 1954లో జాతీయ చలనచిత్ర పురస్కారాలు ప్రారంభమైన నాటి నుంచి సాధారణంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌నే ఈ వేడుకలకు వేదికగా ఎంచుకుంటూ వచ్చారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఆనవాయితీని పక్కనపెట్టి తొలిసారి మరో రాష్ట్రంలో అవార్డుల వేడుకను నిర్వహిస్తుండటంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇక ఈ ఏడాది అవార్డుల విజేతల విషయానికి వస్తే.. 'ఆర్టికల్ 370' ఉత్తమ చలనచిత్రంగా నిలిచింది. ఈ చిత్రంలో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి నటించిన 'బ్రహ్మయుగం', బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటించిన 'చందు ఛాంపియన్' సంయుక్తంగా ఉత్తమ నటుడు పురస్కారాన్ని దక్కించుకున్నాయి. ఇక తెలుగు చిత్ర పరిశ్రమకు కూడా ఈ జాతీయ పురస్కారాల్లో గౌరవం దక్కింది. ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సైన్స్‌ఫిక్షన్ దృశ్యకావ్యం 'కల్కి 2898 ఏడీ' బెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ అవార్డును సొంతం చేసుకుంది. దీంతో ఈ ఏడాది జాతీయ చలనచిత్ర పురస్కారాల వేడుకపై సినీ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# చిరుకు నీడలా.. అనస్వర!

టాలీవుడ్‌లో వరుస అవకాశాలను అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఏదైనా ఉందంటే.. అది మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటిస్తున్న 'కాకా' అనే చెప్పాలి. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అనస్వర.. చిరంజీవి కూతురి పాత్రలో కనిపించబోతున్నారు. తాజాగా మేకర్స్ ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ పోస్టర్‌లో అనస్వర ఎంతో అందంగా, సంప్రదాయబద్ధమైన హోమ్లీ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. అయితే ఆమె లుక్ కంటే ఎక్కువగా.. పోస్టర్‌లో చూపించిన తండ్రి–కూతుళ్ల అనుబంధం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తన కూతురికి ఎప్పుడూ నీడలా అండగా నిలిచే తండ్రి.. ఆమెకు ఏ కష్టం వచ్చినా ముందుండి కాపాడే రక్షకుడిగా చిరంజీవి పాత్ర ఉండబోతున్నట్లు ఈ ఫస్ట్ లుక్‌తో మేకర్స్ ఆసక్తికరమైన హింట్ ఇచ్చారు. కూతురి జీవితమే తన ప్రపంచంగా భావించే తండ్రి, ఆయనపై అంతులేని నమ్మకంతో ఉండే కూతురు.. వీరి మధ్య సాగే ఎమోషనల్ జర్నీ సినిమాకు కీలకంగా ఉండబోతుందనే భావన కలుగుతోంది. మరోవైపు చిరంజీవి వంటి మెగాస్టార్‌తో తండ్రీకూతుళ్ల బంధాన్ని పంచుకునే పాత్రలో అనస్వర ఎలా మెప్పించబోతుందనేది ఆసక్తికరంగా మారింది. యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తూ 'కాకా'ను ఓ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సంక్రాంతి బరిలో మెగాస్టార్ ఎలాంటి ట్రీట్ ఇవ్వబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది. ఈ భారీ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. మరి మెగాస్టార్–అనస్వర తండ్రీకూతుళ్ల అనుబంధం తెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



# ప్రియదర్శి–నాగ దుర్గ.. 'శ్రీలత'తో ప్రేమ గీతం!

టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి, ఫోక్ సెన్సేషన్ నాగ దుర్గ జంటగా నటిస్తున్న డిఫరెంట్ మూవీ 'ఇదుపు కాయితం'. వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. 'ఓ శ్రీలత' అంటూ సాగే ఈ పాట ప్రోమో ఇప్పటికే విడుదలై ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రియదర్శి.. నాగ దుర్గను బతిమాలాడే తీరు, ఇద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీ పాటపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఇక తాజాగా ఈ సాంగ్ లిరికల్ వీడియో రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రేక్షకులు పదే పదే వినాలనుకున్న 'శ్రీలత' పాటను సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపారు. బొబ్బిలి సురేష్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ పేర్కొన్నారు. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై బన్నీ వాస్, తబితా సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అభినవ్ గోమఠం, శివజ్యోతి, వీ6 సుజాత, మౌనికా రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'శ్రీలత' పాట ఫుల్ వీడియో ఎలా ఉండబోతుందో చూడాలంటే సెప్టెంబర్ 11 వరకు వెయిట్ చేయాల్సిందే!

# స్పీడ్ పెంచిన చరణ్–సుకుమార్ 'ఆర్‌సీ17'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఆర్‌సీ17'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత ఈ ఇద్దరూ మరోసారి చేతులు కలపడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే క్రేజ్ పీక్స్‌లో ఉంది. అందుకే సినిమా నుంచి ఏ చిన్న అప్‌డేట్ వచ్చినా మెగా అభిమానుల్లో ఒక్కసారిగా ఉత్సాహం పెరుగుతోంది. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. సుకుమార్ చాలాకాలంగా కథ, స్క్రీన్‌ప్లేపై కసరత్తు చేస్తూ వచ్చిన ఈ చిత్రానికి ఫైనల్ స్క్రిప్ట్‌ను లాక్ చేసినట్లు సమాచారం. స్క్రిప్ట్ వర్క్ పూర్తవడంతో ఇప్పుడు చిత్ర బృందం ప్రీ–ప్రొడక్షన్ పనులపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. లొకేషన్ల ఎంపిక, క్యాస్టింగ్, ఇతర సాంకేతిక ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయని టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అంతేకాదు.. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను డిసెంబర్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తాజా కథనాలు చెబుతున్నాయి.



'రంగస్థలం'లో చరణ్‌ను సరికొత్తగా ప్రజెంట్ చేసి సంచలనం సృష్టించిన సుకుమార్.. ఈసారి ఎలాంటి కథతో మెగా పవర్ స్టార్‌ను చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. కథ విషయంలో సుకుమార్ ఎక్కడా రాజీ పడకుండా ఎంతో సమయం తీసుకుంటుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. మొత్తానికి ఇన్నాళ్ల ఎదురుచూపులకు తెరదించుతూ 'ఆర్‌సీ17' త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లబోతుందనే వార్త మెగా అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతోంది.

## సాయి పల్లవి-విజయ్ సేతుపతి..
# ప్రేమలో పడేశారుగా!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి జోడీగా తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ నుంచి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. తాజాగా ఈ సినిమాకు 'ఇంజివెల్లం' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు మేకర్స్ ప్రకటిస్తూ.. ఓ బ్యూటిఫుల్ రొమాంటిక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో విజయ్ సేతుపతి–సాయి పల్లవి మధ్య కనిపిస్తున్న కెమిస్ట్రీ ఆకట్టుకోవడంతో సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి మరింత పెరిగింది. 'పొన్నియిన్ సెల్వన్' వంటి భారీ విజయాల తర్వాత దిగ్గజ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామాపై సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమకథను తనదైన శైలిలో మణిరత్నం ఎలా ఆవిష్కరించబోతున్నారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ సినిమాను 2027 సంక్రాంతి స్పెషల్‌గా జనవరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొత్తానికి టైటిల్‌తోనే ప్రేమలో పడేసిన 'ఇంజివెల్లం'.. థియేటర్ల లో ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

# గాసిప్స్ మధ్య కొత్త కాంబో!

భార్య ఆర్తితో విడాకుల తర్వాత రవిమోహన్, సింగర్ కెనీషా డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఎన్నిసార్లు క్లారిటీ ఇచ్చినా రూమర్స్ మాత్రం ఆగలేదు. తాజాగా వీరిద్దరూ కలిసి 'అన్ ఆర్డినరీ మ్యాన్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించారు. రవిమోహన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు హీరోగా నటిస్తుండగా.. కెనీషా సంగీతం అందిస్తున్నారు. తొలుత ఈ సినిమాకు మ్యూజిక్ చేయడానికి ఆసక్తి లేకపోయినా, రవిమోహన్ చెప్పిన కథ నచ్చడంతో ఒప్పుకున్నట్లు కెనీషా తెలిపారు. ముందుగా మూడు పాటలు సిద్ధం చేసి టీమ్‌కు వినిపించగా.. అందరూ సంతృప్తి చెందడంతో ప్రాజెక్ట్‌లోకి అధికారికంగా అడుగుపెట్టినట్లు వెల్లడించారు.



## బాలయ్యను ఢీకొట్టబోతున్న మనోజ్..
# గూస్‌బంప్స్ విలనిజం!

నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'దాదా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' ఘన విజయం సాధించడంతో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మంచు మనోజ్ పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించ నున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో గోపీచంద్ మలినేని మాట్లాడుతూ.. మనోజ్ పాత్ర ఇప్పటివరకు ఆయన చేసిన రోల్స్‌కు పూర్తి భిన్నంగా ఉంటుందని వెల్లడించారు. కథకు అవసరమైన డార్క్ షేడ్స్, నెగెటివిటీని మనోజ్ తన నటనతో అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారని చెప్పారు. బాలకృష్ణ లాంటి మాస్ ఐకాన్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడంతో మనోజ్ ఎంతో ఉత్సాహంగా ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారని తెలిపారు. ఆయన పార్ట్ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోందని వెల్లడించారు. ముఖ్యంగా బాలయ్య–మనోజ్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని, మునుపెన్నడూ చూడని విలనిజాన్ని 'దాదా'లో చూస్తారని గోపీచంద్ చేసిన కామెంట్స్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# ప్రేమకు ఎన్ని పరీక్షలొచ్చినా.. తగ్గేదేలే!

తమిళ చిత్రసీమలోకి అడుగుపెట్టిన అతి తక్కువ సమయంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్. ఇటీవల 'బ్లాస్ట్' మూవీతో బాక్సాఫీస్ వద్ద సందడి చేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు మరో డిఫరెంట్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. టాలెంటెడ్ హీరో అశోక్ సెల్వన్ సరసన ఆమె నటించిన 'అన్బిల్ అవన్'పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఆర్. కార్తికేయన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విఘ్నేష్ రాజా కథ అందించగా.. గోవింద్ వసంత సంగీతం సమకూర్చారు. ఇక కథలోకి వెళ్తే.. ఎంతో ప్రేమతో పెళ్లి బంధంలోకి అడుగుపెట్టిన ఓ యువ జంట జీవితంలో అనుకోని పరిణామాలు అలజడి సృష్టిస్తాయి. సంతోషంగా సాగిపోతున్న వారి కాపురంలో ఎదురైన ఓ విపత్కర పరిస్థితి.. ఇద్దరి మధ్య ఉన్న ప్రేమతో పాటు నమ్మకానికీ పెద్ద పరీక్షగా మారుతుంది. ఆ కష్టాన్ని దాటేందుకు వారు చేసే ప్రయత్నాలు ఎక్కడికి దారితీస్తాయి? పరిస్థితులు ఎంతగా ప్రతికూలించినా వారి బంధం నిలబడుతుందా? లేక అదే పరిస్థితులు వారి ప్రేమకు ముగింపు పలుకుతాయా? అనే ఆసక్తికరమైన మలుపులతో కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ప్రేమ, అనుబంధం, నమ్మకం.. ఈ మూడింటి మధ్య జరిగే భావోద్వేగ ప్రయాణమే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా ముగించుకుని విడుదలకు సిద్ధమైంది. వినాయక నిమజ్జనం పండుగ కానుకగా సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'ఏమాత్రం టెన్షన్, భయం లేని.. స్వచ్ఛమైన ప్రశాంతమైన ప్రగాఢ ప్రేమకథను ఆస్వాదించండి' అంటూ విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

# 'కింగ్'లో షారుఖ్ భార్యగా స్టార్ హీరోయిన్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'కింగ్'పై అంచనాలు భారీగా ఉన్నాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో షారుఖ్‌తో పాటు ఆయన కుమార్తె సుహానా ఖాన్, దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ స్టార్ క్యాస్ట్‌కు ఇప్పుడు మరో క్రేజీ పేరు జతైనట్లు బాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. సీనియర్ హీరోయిన్ రాణి ముఖర్జీ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించబోతున్నారనేది తాజా టాక్. అంతేకాదు.. ఆమె పాత్రకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం కూడా వైరల్ అవుతోంది.



సినిమాలో రాణి ముఖర్జీ షారుఖ్ ఖాన్ భార్యగా కనిపించనున్నారని, అవినీతిమయమైన వ్యవస్థ కారణంగా ఆమె మరణం కథలో కీలక మలుపుకు కారణమవుతుందని సమాచారం. పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ.. కథను మలుపు తిప్పే కీలక పాత్ర ఇదేననే టాక్ వినిపిస్తోంది. గతంలోనూ రాణి 'కింగ్'లో భాగమవుతున్నారనే వార్తలు వచ్చినప్పటికీ, ఆమె అసలు పాత్రపై అధికారిక స్పష్టత మాత్రం లేదు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వార్తల్లో నిజమెంత? రాణి పాత్ర కథలో ఎలాంటి ప్రభావం చూపించనుంది? అన్నది ఆసక్తిగా మారింది. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తేనే పూర్తి క్లారిటీ రానుంది. ఇక 'కింగ్' క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.